# పెన్ పవర్

11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి

CELEBRATING 11TH YEAR ANNIVERSARY

తెలుగు దిన పత్రిక | PEN POWER TELUGU DAILY | ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 9 సంచిక : 35 పేజీలు :12+12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 12 అక్టోబర్ 2025 వెల : 5/-రూ ॥

VOLUME :9 ISSUE : 35 PAGES :12 +12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 12 OCTOBER 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## అన్నపర్రు హాస్టల్ ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా...

### అధికారులకు కీలక ఆదేశాలు



- అస్వస్థతకు గురైన బీసీ హాస్టల్ విద్యార్థులు
- మంత్రి సవిత, అధికారులతో సీఎం చంద్రబాబు ఫోన్‌లో సమీక్ష
- గుంటూరు జీజీహెచ్‌లో 24 మందికి చికిత్స
- ఒక విద్యార్థిని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలింపు
- ల్యాబ్ రిపోర్టుల ఆధారంగా చర్యలకు సీఎం ఆదేశం
- తల్లిదండ్రులు ఆందోళన చెందవద్దని భరోసా

పెన్ పవర్ డెస్క్:గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం అన్నపర్రులోని బీసీ బాలుర హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. మంత్రి సవిత, ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రస్తుతం గుంటూరు జనరల్ ఆసుపత్రిలో (జీజీహెచ్) 24 మంది విద్యార్థులు చికిత్స పొందుతున్నారని అధికారులు సీఎంకు వివరించారు. వారిలో ఒక విద్యార్థికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉండటంతో, మెరుగైన వైద్యం

వివరాలు 2లో..

# నెల్లూరు మైపాడు గేట్ సెంటర్ లో స్మార్ట్ స్ట్రీట్...

## వర్చువల్ గా ప్రారంభించిన సీఎం చంద్రబాబు

- డ్వాక్రా మహిళలే యజమానులు... నెల్లూరులో అందుబాటులోకి స్మార్ట్ స్ట్రీట్
- 30 కంటైనర్లలో 120 దుకాణాలు
- 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' పథకం కింద కేటాయింపు
- సోలార్ విద్యుత్, ఫ్రీ వైఫై, సీసీ కెమెరాల వంటి ఆధునిక సౌకర్యాలు
- రాష్ట్రంలోని ఇతర నగరాలకూ ఈ నమూనాను విస్తరిస్తామన్న మంత్రి నారాయణ




పెన్ పవర్ డెస్క్:డ్వాక్రా సంఘాల మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం నెల్లూరు నగరంలో ఒక వినూత్న కార్యక్ర మానికి శ్రీకారం చుట్టింది. మైపాడు గేట్ సెంటర్ వద్ద అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన 'స్మార్ట్ స్ట్రీట్'ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తన కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ స్మార్ట్ స్ట్రీట్‌లో భాగంగా 30 ప్రత్యేక కంటైనర్లను ఉపయోగించి మొత్తం 120 దుకాణాలను ఏర్పాటు చేశారు. 'ఒక కుటుంబం - ఒక పారిశ్రామికవేత్త' పథకం కింద ఈ దుకాణాలన్నింటినీ పూర్తిగా డ్వాక్రా సంఘాల మహిళలకే కేటాయించారు. వీటిలో ఫుడ్ స్టాల్స్, నగల దుకాణాలు సహా పలు రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు అవకాశం కల్పించారు. ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు, లబ్ధిదారులైన మహిళలతో వీడియో లింక్ ద్వారా నేరుగా మాట్లాడి వారిలో స్ఫూర్తి నింపారు. ఈ సందర్భంగా మహిళలు హర్షం వ్యక్తం చేశారు. తమకు ఇలాంటి అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, ఈ స్మార్ట్ స్ట్రీట్ అనేక ప్రత్యేకతలతో రూపుదిద్దుకుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఇక్కడ పూర్తిగా సోలార్ విద్యుత్‌ను వినియోగిస్తారని, వినియోగదారుల కోసం ఉచిత వైఫై సౌకర్యం కూడా ఉంటుందని వివరించారు. భద్రత కోసం సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నెల్లూరులో విజయవంతమైన ఈ నమూనాను స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్రంలోని మిగతా నగరాల్లోనూ ఇలాంటి స్మార్ట్ స్ట్రీట్‌లను ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు.

## అవన్నీ వట్టి పుకార్లే

- కర్ణాటక మంత్రివర్గ విస్తరణపై వస్తున్న వార్తలన్నీ వదంతులేనని స్పష్టీకరణ
- నిరాధార వార్తలను ప్రచురిస్తున్నాయంటూ మీడియాపై డీకే అసహనం
- అక్టోబర్ 13న కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సీఎం సిద్ధరామయ్య విందు సమావేశం
- కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో వాల్మీకి వర్గానికి మంత్రి పదవి ఇస్తామని సీఎం హామీ
- స్థానిక ఎన్నికలపై చర్చించేందుకే ఆ విందు అన్న శివకుమార్



పెన్ పవర్ డెస్క్:కర్ణాటకలో మంత్రివర్గ విస్తరణ లేదా మార్పులపై గత కొద్ది రోజులుగా సాగుతున్న ప్రచారానికి ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెరదించారు.

వివరాలు 2లో..

## బొత్స ఈ మధ్య బాగా ఫోకస్ అవుతున్నారు...

### ఆయనకు జగన్ నుంచే ప్రాణహాని ఉంది



- తనకు ప్రాణహాని ఉందన్న బొత్స
- జగన్ ను మించి ఎవరైనా ఎదిగితే అంతేనన్న పల్లా శ్రీనివాసరావు
- అవసరమైతే బొత్సకు ప్రభుత్వ భద్రత కల్పిస్తామని హామీ

పెన్ పవర్ డెస్క్:వైసీపీ సీనియర్ నేత, శాసనమండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణకు వారి పార్టీ అధినేత జగన్ నుంచే ప్రాణహాని ఉందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సంచలన ఆరోపణలు చేశారు. తనకు ప్రాణహాని ఉందని స్వయంగా బొత్స ప్రకటించిన నేపథ్యంలో,

వివరాలు 2లో..

## పొత్తుకు నో అన్నారని... బీహార్‌లో భారీ ప్లాన్‌తో బరిలోకి ఒవైసీ ఎంఐఎం పార్టీ!



- బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం సంచలన నిర్ణయం
- ఏకంగా 100 స్థానాల్లో పోటీ చేసేందుకు ప్రణాళిక
- 'ఇండియా' కూటమి నుంచి పొత్తుకు స్పందన కరవు
- రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడమే లక్ష్యం
- గత ఎన్నికల్లో ఐదు స్థానాలు గెలుచుకున్న ఎంఐఎం

వివరాలు 2లో..

## మంత్రి పొంగులేటిపై ఖర్గేకు ఫిర్యాదు చేసిన కొండా మురళి

- మేడారం పనులను సొంత కంపెనీకి ఇప్పించుకుంటున్నారని విమర్శ
- సోనియా, రాహుల్ గాంధీలతో పాటు మీనాక్షి నటరాజన్‌లకు ఫిర్యాదు
- అధిష్ఠానం నుంచి సానుకూల స్పందన వచ్చిందన్న కొండా మురళి

పెన్ పవర్ డెస్క్:వరంగల్ రాజకీయాల్లో మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డి జోక్యం చేసుకుం టున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత కొం డా మురళి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికా ర్జున ఖర్గేకు ఫిర్యాదు చేశారు. పొంగులేటి తన సొంత కంపెనీకి



వివరాలు 2లో..

## దళితులను రెచ్చగొట్టేందుకు దుశ్చర్యలకు పాల్పడుతున్నారు



- చిత్తూరు జిల్లా దేవళంపేటలో హోంమంత్రి అనిత పర్యటన
- దగ్ధమైన అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించిన మంత్రి
- నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరిక

వివరాలు 2లో..

## భారత్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే అలా కూడా చేయండి

### నరేంద్ర మోదీ పిలుపు



- ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలన్న ప్రధాని
- దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులది ముఖ్య పాత్ర అని వ్యాఖ్య
- ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను మన వద్ద పండించాలన్న మోదీ

వివరాలు 2లో..

## చొరబాట్ల వల్లే ముస్లిం జనాభా అసాధారణంగా పెరుగుతోంది

- దేశంలో కొన్ని ప్రాంతాల్లో జనాభా మార్పులకు చొరబాట్లే కారణమన్న అమిత్ షా
- కొన్ని పార్టీలు చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని ఆరోపణ
- అసోం, పశ్చిమ బెంగాల్‌లో ముస్లిం జనాభా అసాధారణ వృద్ధి అని వెల్లడి
- చొరబాట్లు దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ముప్పుగా అభివర్ణన
- సరిహద్దు భద్రతలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తప్పనిసరి అని స్పష్టీకరణ




పెన్ పవర్ డెస్క్: దేశంలోని కొన్ని ప్రాంతాలలో ముస్లిం జనాభా అసాధారణంగా పెరగడానికి అక్రమ చొరబాట్లే ప్రధాన కారణమని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇది కేవలం రాజకీయ సమస్య కాదని, దేశ భద్రతకు, ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదంగా పరిణమించిందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. 'దైనిక్ జాగరణ్' మాజీ సంపాదకుడు నరేంద్ర మోహన్ స్మారకోపన్యాసంలో అమిత్ షా ఈ మేరకు మాట్లాడారు. కొన్ని రాష్ట్రాల్లోని జనాభా లెక్కలను ఉటంకిస్తూ అమిత్ షా తన వాదనను వినిపించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం అసోంలో ముస్లిం జనాభా పదేళ్లలో 29.6 శాతం పెరిగిందని, చొరబాట్లు లేకుండా ఈ స్థాయిలో వృద్ధి అసాధ్యమని స్పష్టం చేశారు. అదేవిధంగా పశ్చిమ

వివరాలు 2లో..

## దక్షిణ కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం...

### ఐదు జిల్లాలకు అలర్ట్



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురవనున్నాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన

వివరాలు 2లో..

## నేడు విశాఖలో మంత్రి నారా లోకేశ్ పర్యటన..

### ఏపీలో మొట్టమొదటి ఏఐ డేటా సెంటర్ కు శంకుస్థాపన



- డేటా సెంటర్ల హబ్ గా విశాఖ
- సిఫీ సంస్థ రూ.1500 కోట్ల భారీ పెట్టుబడి
- వెయ్యి మందికి పైగా ఉద్యోగ అవకాశాలు
- ఏఐ ఆధారిత డేటా సెంటర్‌తో పాటు కేబుల్ ల్యాండింగ్ స్టేషన్
- గ్లోబల్ డిజిటల్ గేట్‌వేగా మారనున్న విశాఖ

వివరాలు 2లో..

## పుస్తకాలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి



- లక్ష్మీ పురి రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన పవన్
- పుస్తకాలు చదవడం వల్లే మానసిక పరిపక్వత వస్తుందన్న పవన్
- పవన్ కల్యాణ్ తన అభిమాన నాయకుడని చెప్పిన మంత్రి సత్యకుమార్

వివరాలు 2లో..

# ఎడిటర్ వ్యూ

## లీడర్లు సరే... కేడర్ సంగతేంటీ

ఇటీవలి రోజులలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు టీడీపీ , జనసేన పార్టీల మధ్య సంబంధాలపై చర్చనీయాంసంగా మారాయి. ముఖ్యంగా అసెంబ్లీలో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి చేసిన వ్యాఖ్యలు రెండు పార్టీల మధ్య స్వల్ప ఉద్రిక్తతకు దారి తీశాయి. ఈ సంఘటనలతో క్షేత్రస్థాయిలో ఉన్న నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం, సోషల్ మీడియాలో దూషణలకు దిగడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. అయితే ఈ ఉద్రిక్తతలు పైస్థాయిలో అంతగా ప్రభావం చూపలేదని చెప్పాలి.అయితే అగ్రనేతల స్థాయిలో మాత్రం సమన్వయం కొనసాగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆరోగ్యం బాగాలేదని తెలుసుకుని ఆయన నివాసానికి వెళ్లి దాదాపు నలభై నిమిషాలు సమావేశం కావడం, చర్చలు జరపడం రెండు పార్టీల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని చూపించింది. దీంతో తాత్కాలికంగా ఉన్న ఉద్రిక్తతలు చల్లారినట్లు కనిపించాయి. పై స్థాయిలో ఇద్దరు నాయకులు పరస్పర గౌరవం, అవగాహనతో ముందుకు సాగుతున్నారు.విజయవాడ లో జరిగిన "ఆటో డ్రైవర్ల సేవలో" అనే కార్యక్రమంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు ఇద్దరూ పాల్గొని ఒకే వేదికపై కనిపించారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయకత్వాన్ని ప్రశంసించడం, ఆయన సారథ్యంలో రాష్ట్రం ముందుకు సాగుతోందని చెప్పడం కూడా రెండు పార్టీల మధ్య ఉన్న అనుబంధాన్ని బలపరిచింది. దీని ద్వారా అగ్ర నాయకుల మధ్య పెద్ద విభేదాలు లేవని స్పష్టమవుతోంది.అయితే క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలకు మద్దతుగా నిలిచిన టీడీపీ నాయకులు, దానికి వ్యతిరేకంగా స్పందించిన జనసేన నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. చిరంజీవి పై బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలను తప్పు అంటున్న జనసేన నాయకులు ఎక్కువగా ఉన్నారు. ఈ కారణంగా కొన్ని నియోజకవర్గాల్లో రెండు పార్టీల మధ్య విభేదాలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితి కొనసాగితే నష్టం క్షేత్రస్థాయి నాయకులకే జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ఇక రాబోయే ఎన్నికల దృష్ట్యా రెండు పార్టీలూ తమ బలం పెంపుపై దృష్టి సారిస్తున్నాయి. జనసేన పార్టీ నూతన నాయకులను ముందుకు తెచ్చే ప్రయత్నంలో ఉండగా, టీడీపీ మాత్రం ఆచితూచి అభ్యర్థులను ఎంపిక చేయాలని చూస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ఈ అంతర్గత విభేదాలు కొంతమంది స్థానిక నాయకులకు ఇబ్బందులు తెచ్చే అవకాశం ఉంది. అగ్ర నాయకులు పరస్పర అవగాహనతో ముందుకు సాగుతున్న సమయంలో, క్షేత్రస్థాయి నాయకులు కూడా అదే మార్గాన్ని అనుసరించాల్సిన అవసరం ఉంది. లేకపోతే పార్టీ బలహీనపడడమే కాకుండా, వారి రాజకీయ భవిష్యత్తుపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.

## అన్నపర్రు హాస్టల్ ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా...

- మొదటి పేజి తరువాయి

కోసం నిపుణుల సలహా మేరకు మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. మిగిలిన విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉందని మంత్రి సవిత ముఖ్యమంత్రికి తెలియజేశారు. పెదనందిపాడు వైద్య శిబిరంలో చికిత్స పొందిన వారిలో ఇద్దరు మినహా మిగిలిన వారందరినీ డిశ్చార్జ్ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థులు పూర్తిగా కోలుకున్న తర్వాతే వారిని డిశ్చార్జ్ చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. హాస్టల్‌లో అందిస్తున్న ఆహారం నాణ్యత, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఆయన ఆరా తీశారు. అన్నపర్రు గ్రామంతో పాటు హాస్టల్ ప్రాంగణంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపడుతున్నట్లు మంత్రి సవిత ఈ సందర్భంగా వివరించారు.

కలుషిత ఆహారం వల్లే ఈ ఘటన జరిగి ఉండవచ్చని వైద్యులు ప్రాథమికంగా భావిస్తున్నట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. నిర్ధారణ కోసం నీరు, ఆహార నమూనాలను ల్యాబ్‌కు పంపించామని, ఆ నివేదికలు వచ్చిన వెంటనే వాటి ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఈ ఘటనపై విద్యార్థుల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో ఉన్న చిన్నారుల ఆరోగ్యానికి ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని, వారికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తనకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని మంత్రి, అధికారులను ఆదేశించారు.

## మంత్రి పొంగులేటిపై ఖర్గేకు ఫిర్యాదు చేసిన కొండా మురళి

- మొదటి పేజి తరువాయి

మేడారం పనులను ఇప్పించుకుం టున్నారని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్‌కు కూడా కొండా మురళి ఫిర్యాదు చేశారు.

ఈ విషయంలో అధిష్ఠానం నుంచి తమకు సానుకూల స్పందన వచ్చిందని కొండా మురళి తెలిపారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.వచ్చే ఏడాది మేడారం జాతరను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. అయితే మేడారం టెండర్ల వ్యవహారంలో పొంగులేటి తన సొంత కంపెనీకి పనులు ఇప్పించుకుంటున్నారని కొండా మురళి భార్య, మంత్రి కొండా సురేఖ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారాన్ని ఆమె ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.

## దక్షిణ కోస్తాంధ్రపై ఉపరితల ఆవర్తనం... ఐదు జిల్లాలకు అలర్ట్

- మొదటి పేజి తరువాయి

ఉపరితల ఆవర్తన ప్రభావంతో ఆదివారం (అక్టోబర్ 12) రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని స్పష్టం చేసింది.విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం, రేపు అల్లూరి సీతారామరాజు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడవచ్చని అధికారులు అంచనా వేశారు.వర్షాల సమయంలో ఉరుములు, మెరుపులు ఆకస్మికంగా సంభవించే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని హెచ్చరించారు.ఇప్పటికే ఈ ఆవర్తన ప్రభావంతో రాష్ట్రంలోని పలుచోట్ల వర్షపాతం నమోదైందని సంస్థ వివరించింది. గడిచిన 24 గంటల్లో చిత్తూరులో 34.2 మిల్లీమీటర్లు, తూర్పు గోదావరి జిల్లా లక్ష్మీపురంలో 31 మిల్లీమీటర్లు, శ్రీకాకుళం జిల్లా కోర్లాంలో 26.7 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయినట్లు తెలిపింది.

# దళితులను రెచ్చగొట్టేందుకు దుశ్చర్యలకు పాల్పడుతున్నారు

చిత్తూరు జిల్లా దేవళంపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని దుండగులు దహనం చేసిన ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. ఈ చర్య వెనుక రాజకీయ కుట్ర ఉందని, దళితులను రెచ్చగొట్టేందుకే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. శనివారం దేవళంపేటలో పర్యటించిన మంత్రి, అగ్నికి ఆహుతైన అంబేద్కర్ విగ్రహం ఉన్న ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ, "అంబేద్కర్ విగ్రహానికి నిప్పుపెట్టిన నిందితులను త్వరలోనే పట్టుకుని కఠినంగా శిక్షిస్తాం. రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే ఓర్వలేక కొందరు కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆమె మండిపడ్డారు. గతంలో జరిగిన డాక్టర్ సుధాకర్, డాక్టర్ అనితా రాణి ఘటనలపై జగన్ ఎందుకు నోరు మెదపడం లేదని ఆమె సూటిగా ప్రశ్నించారు. సమాజంలో నేరాలకు పాల్పడే వ్యక్తులు రాజకీయ ముసుగు వేసుకుని తిరుగుతున్నారని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు. ఈ ఘటన వెనుక ఉన్న కుట్రదారులను చట్టం ముందు నిలబెడతామని ఆమె హామీ ఇచ్చారు.

## పొత్తుకు నో అన్నారని... బీహార్‌లో భారీ ప్లాన్‌తో బరిలోకి ఒవైసీ ఎంఐఎం పార్టీ!

బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని ఎంఐఎం పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల్లో ఏకంగా 100 స్థానాల్లో పోటీ చేయాలని యోచిస్తున్నట్లు ప్రకటించింది. 'ఇండియా' కూటమి నుంచి పొత్తు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో, ఒంటరిగా తమ బలాన్ని నిరూపించుకోవాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఈ పరిణామం బీహార్ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఐదు రెట్లు ఎక్కువ స్థానాల్లో పోటీకి దిగుతున్నామని ఎంఐఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు అఖ్తరుల్ ఇమాన్ శనివారం వెల్లడించారు. రాష్ట్రంలో ఎన్డీఏ, మహాఘట్‌బంధన్ (ఇండియా కూటమి) కూటములకు ప్రత్యామ్నాయంగా మూడో రాజకీయ శక్తిగా ఎదగడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "మా ఉనికిని ఇటు ఎన్డీఏ, అటు మహాఘట్‌బంధన్ గుర్తించేలా చేస్తాం. మా బలాన్ని తక్కువ అంచనా వేయలేరు" అని ఆయన అన్నారు.పొత్తు కోసం ఆర్జేడీ అధినేతలు లాలూ ప్రసాద్ యాదవ్, తేజస్వి యాదవ్‌లకు తాను లేఖ రాసినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదని అఖ్తరుల్ ఇమాన్ తెలిపారు. "వారి నుంచి స్పందన లేనప్పుడు, మా పార్టీ బలాన్ని విస్తరించుకోవడానికి మేము అన్ని విధాలా ప్రయత్నించాలి. ఇప్పటికే కొన్ని భావసారూప్యత కలిగిన పార్టీలతో మూడో ఫ్రంట్ ఏర్పాటు విషయమై చర్చిస్తున్నాం. మరికొన్ని రోజుల్లో దీనిపై పూర్తి స్పష్టత వస్తుంది" అని ఆయన వివరించారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం ఐదు స్థానాల్లో గెలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే, ఆ తర్వాత నలుగురు ఎమ్మెల్యేలు ఆర్జేడీలో చేరడంతో ప్రస్తుతం అఖ్తరుల్ ఇమాన్ మాత్రమే పార్టీ ఏకైక శాసనసభ్యుడిగా కొనసాగుతున్నారు. బీహార్‌లో 17 శాతానికి పైగా ఉన్న ముస్లిం జనాభానే లక్ష్యంగా చేసుకుని ఎంఐఎం తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇటీవల పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ కూడా సీమాంచల్ ప్రాంతంలో పర్యటించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు.బీహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 6, 11 తేదీల్లో ఎన్నికలు జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఎంఐఎం పోటీతో సెక్యులర్ ఓట్లు చీలి బీజేపీకి లాభం చేకూరుతుందని విపక్షాలు ఆరోపిస్తుండగా, తమ పార్టీ ఏ కూటమికి 'బీ-టీమ్' కాదని ఎంఐఎం నేతలు స్పష్టం చేస్తున్నారు.

## అవన్నీ వట్టి పుకార్లే

- మొదటి పేజి తరువాయి

అవన్నీ నిరాధారమైన వదంతులేనని, ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనేదీ లేదని ఆయన శనివారం స్పష్టం చేశారు. బెంగళూరులోని లాల్‌బాగ్ బొటానికల్ గార్డెన్‌లో జరిగిన 'బెంగళూరు వాక్' కార్యక్రమంలో ప్రజలతో ముచ్చటించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."ప్రస్తుతం కేబినెట్ విస్తరణ జరగడం లేదు. దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు. కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలు తెలుసుకోకుండా వార్తలు ప్రచురిస్తున్నాయి. ఇలాంటి ప్రతిపాదన ఏదైనా ఉంటే ముఖ్యమంత్రి గానీ, నేను గానీ సూచించాలి. మేమిద్దరం అలాంటిదేమీ చెప్పనప్పుడు, అదంతా తప్పుడు ప్రచారమే అవుతుంది. ఏదైనా ఉంటే అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుంది" అని శివకుమార్ స్పష్టం చేశారు.

**ఒకవైపు ఖండన.. మరోవైపు సీఎం విందు**

డీకే శివకుమార్ మంత్రివర్గ విస్తరణ వార్తలను ఖండిస్తున్నప్పటికీ, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అక్టోబర్ 13న కాంగ్రెస్ ఎమ్మెల్యేల కోసం ప్రత్యేకంగా విందు సమావేశం ఏర్పాటు చేయడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. బీహార్ ఎన్నికల తర్వాత కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని సీఎం సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. దీనికి తోడు, వాల్మీకి జయంతి వేడుకల్లో మాట్లాడిన సిద్ధరామయ్య, తదుపరి పునర్వ్యవస్థీకరణలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన నేతకు తప్పకుండా మంత్రి పదవి ఇస్తామని హామీ ఇవ్వడం ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తోంది. అయితే, రాబోయే మున్సిపల్, జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలపై చర్చించేందుకే సీఎం విందు సమావేశం ఏర్పాటు చేశారని శివకుమార్ అంటున్నారు.

## నేడు విశాఖలో మంత్రి నారా లోకేశ్ పర్యటన..

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉత్తరాంధ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. విశాఖపట్నాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చే ప్రయత్నంలో భాగంగా కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం నాడు విశాఖ నగరంలో పర్యటించి, రాష్ట్రంలోనే మొట్టమొదటి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమం విశాఖ భవిష్యత్ ప్రగతికి నాంది పలకనుందని భావిస్తున్నారు.కూటమి ప్రభుత్వ పాలనలో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారనున్నాయి. విశాఖ డేటా సెంటర్ల హబ్ గా రూపుదిద్దుకోనుంది. విశాఖలో 5 లక్షల ఐటీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్న మంత్రి నారా లోకేశ్... ఈ దిశగా శరవేగంగా అడుగులు వేస్తున్నారు. అక్టోబర్ 12వ తేదీన విశాఖలో మొట్టమొదటి ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్(%జూూ%) కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ఏఐ ఆధారిత డేటా సెంటర్ రాక వల్ల భారతదేశ తదుపరి గ్లోబల్ డిజిటల్ గేట్ వేగా విశాఖ రూపుదిద్దుకోవడంతో పాటు సముద్రపు కేబుల్ కనెక్టివిటీ, ఏఐ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయనుంది. రాష్ట్రంలో సాంకేతిక రంగం అభివృద్ధిలో భాగంగా నారా లోకేశ్... నాస్ డాక్ లో నమోదైన దేశ ప్రముఖ డిజిటల్ ఐసీటీ సొల్యూషన్స్ ప్రొవైడర్ సిఫీ టెక్నాలజీస్ అనుబంధ సంస్థ సిఫీ ఇన్ఫినిట్ స్పేసెస్ లిమిటెడ్(%ాఱటఎ ×అటఱఅఱ్ రాజూఖఎవం ాఱఎఱ్వం%) నిర్మించబోయే 50 మెగావాట్ల ఏఐ ఆధారిత ఎడ్జ్ డేటా సెంటర్ తో పాటు ఓపెన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ కు శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన 3.6 ఎకరాల భూమిలో రూ.1,500 కోట్ల పెట్టుబడితో రెండు దశల్లో ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్ ను సిఫీ అభివృద్ధి చేయనుంది. తద్వారా వెయ్యిమందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. నూతన కేబుల్ ల్యాండింగ్ స్టేషన్(%జూూ%) సదుపాయం వల్ల సముద్రపు కేబుల్ కనెక్టివిటీని మెరుగుపరుస్తూ.. ఎడ్జ్ స్థాయిలో ఏఐ కంప్యూటింగ్ సామర్థ్యాన్ని విస్తరించే అవకాశం కల్పిస్తుంది. భారతదేశంతో

ంపాటు ఆగ్నేయాసియాలోని సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, థాయ్ లాండ్ వంటి దేశాల మధ్య త్వరితగతిన డేటా ప్రాసెసింగ్ చేస్తూ విశాఖ సీఎల్ఎస్ వ్యూహాత్మక ల్యాండింగ్ పాయింట్ గా పనిచేస్తుంది.

## బొత్స ఈ మధ్య బాగా ఫోకస్ అవుతున్నారు... ఆయనకు జగన్ నుంచే ప్రాణహాని ఉంది

- మొదటి పేజి తరువాయి

ఆయనకు ప్రభుత్వపరంగా పూర్తి భద్రత కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పల్లా ప్రకటించారు. నేడు మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. బొత్స మాటలను బట్టి చూస్తే, ఆయనకు వైసీపీ నుంచే ముప్పు పొంచి ఉందని స్పష్టమవుతోందని పల్లా అన్నారు."జగన్‌ను మించి వెళ్లినా, పార్టీలో ఆయనకన్నా ఎక్కువ పేరు సంపాదించుకున్నా వారిని అంతం చేయడమే ఆయన నైజం" అని పల్లా శ్రీనివాసరావు తీవ్రస్థాయిలో విమర్శించారు. వైఎస్ వివేకానంద రెడ్డిని కూడా ఇదే కారణంగా హత్య చేశారని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం ప్రతిపక్ష నేతగా, మండలిలో బొత్స పనితీరు బాగా ఫోకస్ అవుతోందని, ఇది చూసి ఓర్వలేకే జగన్ ఆయనపై కక్ష పెంచుకున్నారని అనిపిస్తోందని పల్లా అభిప్రాయపడ్డారు. "బొత్స సత్యనారాయణ అంటే మాకు గౌరవం ఉంది. ఆయన భయపడాల్సిన అవసరం లేదు. మేం ఆయనకు అండగా నిలుస్తాం" అని పల్లా హామీ ఇచ్చారు.

**కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు**

రాష్ట్రంలో ఉన్న మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి పల్లా శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో టీసీఎస్, మహేంద్ర, లూలూ, రిలయన్స్, ఎన్టీపీసీ గ్రీన్ టెక్ హైడ్రోజన్, వంటి అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్నాయంటే సీఎం చంద్రబాబు వల్లే అన్నారు. "విశాఖకు ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్ రాబోతోంది. విశాఖలో సిఫీ ఏఐకి సంబంధించి ఒక డేటా సెంటర్ మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో ప్రారభించబోతున్నారు. ఢిల్లీలో గూగూల్ కు చెందిన రైడెన్ తో రూ.87,500 కోట్లతో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకోబోతున్నాం. ప్రసిద్ధి చెందిన డేటా సెంటర్ గా వర్జీనియా ఉంది. రేపు వరల్డ్ డేటా సెంటర్ గా విశాఖ మారబోతోంది. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర ప్రదేశ్ గా చేయాలన్న లక్ష్యంతో అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు సీఎం చంద్రబాబు కృషి చేశారు. చంద్రబాబుపై నమ్మకంతో అనేక పరిశ్రమలు ఏపీకి వస్తున్నాయి. విశాఖను డేటా హబ్ గా, డేటా వ్యాలీగా ప్రపంచంలోనే ఉన్నతమైన స్థానానికి తీసుకెళ్లబో తున్నాం. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి నారా లోకేష్ సాకారంతో నేడు విశాఖ ఐటీ సీటీగా రూపాంతరం చెందబోతోంది. విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తుంటే... జగన్ అడుగడుగునా భవిష్యత్ భయంతో అడ్డుపడుతున్నారు. రాష్ట్ర ప్రయోజనాలను అడ్డుకుంటున్నారు. రాష్ట్రానికి ఎటువంటి పెట్టుబడులు రాకుండా చూడాలని కుట్రలు చేస్తున్నారు. పెట్టుబడి దారులకు భయాందోళనలు కలిగించేలా జగన్ అల్లర్లు చేస్తున్నారు. పెట్టబడులు పెట్టకండని అనేక ఆర్థిక సంస్థలకు వైసీపీ వాళ్లు లేఖలు రాసి రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు" అంటూ పల్లా ధ్వజమెత్తారు.

## భారత్ దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే అలా కూడా చేయండి

భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే వరి, గోధుమ పంటలతోపాటు ప్రొటీన్ అధికంగా లభించే పప్పుల సాగును మరింత పెంచాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఆయన పీఎం ధన్ ధాన్య కృషి యోజన, మిషన్ ఫర్ ఆత్మనిర్భరత కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, దేశం వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయడంలో రైతులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు.ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను మన దేశంలో పండించాలని ఆయన పిలుపునిచ్చారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్ల కాలంలో వ్యవసాయ రంగానికి రూ. 5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే, తమ ప్రభుత్వం పదేళ్ల కాలంలో రూ. 13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని ఆయన తెలిపారు.భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని మోదీ అన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చామని వెల్లడించారు. గత ప్రభుత్వం దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనుకబడినవిగా ప్రకటించి వదిలేసిందని, తాము అధికారంలోకి వచ్చాక ఆ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు.

ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలు చేస్తోందని తెలిపారు. వీటన్నింటినీ ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు పేర్కొన్నారు. వెనుకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు వేయించలేదని, అలాంటి ప్రాంతాలను తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందని అన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని, పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయని తెలిపారు.

## చొరబాట్ల వల్లే ముస్లిం జనాభా అసాధారణంగా పెరుగుతోంది

- మొదటి పేజి తరువాయి

బెంగాల్‌లోని పలు జిల్లాల్లో ముస్లిం జనాభా వృద్ధి రేటు 40 శాతం వరకు, సరిహద్దు ప్రాంతాల్లో ఏకంగా 70 శాతం వరకు ఉందని తెలిపారు. ఇవన్నీ గతంలో జరిగిన చొరబాట్లకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు.కొన్ని రాజకీయ పార్టీలు తమ ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నాయని అమిత్ షా తీవ్రంగా ఆరోపించారు. "గుజరాత్, రాజస్థాన్‌లకు కూడా సరిహద్దులు ఉన్నాయి. మరి అక్కడ నుంచి చొరబాట్లు ఎందుకు జరగడం లేదు?" అని ఆయన ప్రతిపక్షాలను ప్రశ్నించారు. చొరబాట్లను అడ్డుకోవడం కేవలం కేంద్ర ప్రభుత్వం లేదా సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) బాధ్యత మాత్రమే కాదని ఆయన స్పష్టం చేశారు.భౌగోళిక పరిస్థితుల కారణంగా అన్ని సరిహద్దు ప్రాంతాల్లో కంచె వేయడం సాధ్యం కాదని, అలాంటి చోట్ల రాష్ట్ర ప్రభుత్వాల సహకారం అత్యంత కీలకమని అమిత్ షా వివరించారు. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని స్థానిక జిల్లా యంత్రాంగం గుర్తించడంలో విఫలమైతే చొరబాట్లను ఎలా ఆపగలమని ఆయన ప్రశ్నించారు. బంగ్లాదేశ్ నుంచి వస్తున్న చొరబాట్ల కారణంగానే ఝూర?ండ్‌లో ఆదివాసీ జనాభా గణనీయంగా తగ్గిపోతోందని కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## పుస్తకాలు నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి

పుస్తకాలు చదవడం ద్వారానే మానసిక పరిపక్వత సాధ్యమవుతుందని, తన జీవితంపై పుస్తకాల ప్రభావం ఎంతో ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ఏ విషయంలోనైనా సమతుల్యత పాటించడం చాలా ముఖ్యమని, తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.ఐక్యరాజ్యసమితి పూర్వ సహాయ సెక్రటరీ జనరల్ లక్ష్మీ ముర్డేశ్వర్ పురి రచించిన 'ఆమె సూర్యుడిని కబళించింది' అనే పుస్తకాన్ని విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో పవన్ కళ్యాణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, "ఒక పుస్తకం చదువుతున్నప్పుడు ఎన్నో కొత్త విషయాలు నేర్చుకుంటాం. ఏదైనా సాధించాలంటే పట్టుదల చాలా అవసరం. ఈ పుస్తకంలోని మాలతి పాత్ర నాకు ఎంతగానో స్ఫూర్తినిచ్చింది. ఆ పాత్రలో ధైర్యసాహసాలు, మేధస్సు, స్వాతంత్ర్య కాలం నాటి భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు కనిపిస్తాయి" అని వివరించారు. తన తల్లి వంట గది నుంచే ప్రపంచాన్ని చూశారని గుర్తుచేసుకున్నారు.

భారతీయ ఆలోచనా విధానం నుంచే తాను వచ్చానని, మన దేశంలో స్త్రీకి అత్యున్నత గౌరవం ఉందని పవన్ స్పష్టం చేశారు. జనసేన పార్టీ మహిళా విభాగానికి 'ఝాన్సీ వీర మహిళ' అని పేరు పెట్టినట్లు గుర్తుచేశారు. ఇదే వేదికపై పవన్ కళ్యాణ్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను త్వరలోనే అమలు చేయబోతున్నామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, "పవన్ కళ్యాణ్ నా అభిమాన నాయకుడు. నేను ఈ రోజు మంత్రిగా కాకుండా సాధారణ వ్యక్తిగా వచ్చి ఉంటే, మీ అందరితో కలిసి కింద కూర్చుని 'పవర్ స్టార్', 'ఓజీ' అని గట్టిగా అరిచేవాడిని" అని తన అభిమానాన్ని చాటుకున్నారు. మంత్రి వ్యాఖ్యలతో సభలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

# పెన్ పవర్

## ఉభయ గోదావరి

కాకినాడ । డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ । తూర్పు గోదావరి । పశ్చిమ గోదావరి । ఏలూరు






# సరస్వతీ దేవి అలంకరణలో హంసవాహనంపై భక్తులకు దర్శనం

## వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 11

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా కొనసాగాయి. వేకువజామున మేలుకొలుపు సేవ, సుప్రభాత సేవ, లక్ష్మీ హోమం, స్వామివారి అలంకార ఉత్సవం ఘనంగా నిర్వహించగా, తొలి హారతితో ఏడువారాల వెంకన్న దర్శనానికి చేరుకున్న భక్తులు ఆధ్యాత్మిక పరవశంతో స్వామివారి దర్శనం పొందారు.బ్రహ్మోత్సవాల రెండవ రోజు సాయంత్రం సరస్వతీ అలంకరణలో హంసవాహన సేవలో స్వామివారు భక్తులకు దివ్యదర్శనమిచ్చారు. వేద పండితులు ఖండవల్లి రాజేశ్వర వరప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సప్తకళశారాధన, అభిషేకం, ప్రధాన హోమములు, దిగ్దేవతా ప్రార్థన, మహాపుష్పయాగం, తీర్థప్రసాద వితరణ మొదలైన పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరిగాయి.హంస వాహన సేవకు ఉన్న ఆధ్యాత్మిక విశిష్టత ప్రత్యేకంగా నిలిచింది. హంస జ్ఞానానికి, వివేకానికి చిహ్నంబీ మంచి చెడులను వేరుచేసే శక్తికి ప్రతీక. కాబట్టి సరస్వతీ దేవి రూపంలో స్వామివారు హంసవాహనంపై దర్శనం ఇవ్వడం భక్తులకు జ్ఞానోదయాన్ని ప్రసాదిస్తుందనే విశ్వాసం నెలకొని ఉంది.ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు దంపతులు, ఉప కమిషనర్ ఎన్.ఎస్. చక్రధర్ రావు దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పరిసరాలను నందనవనం మరిపించేలా పుష్పాలతో అలంకరించడం విశేషం.సాయంత్రం స్వస్తివచనం, సహస్రదీపాలంకరణ సేవ, విశేషార్చన, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వితరణ అనంతరం రాత్రి 7 గంటలకు హంసవాహన సేవ ఘనంగా జరిగింది. మాడవీధులు విద్యుత్ దీపాల వెలుగులో నిండిపోగా, “గోవిందా గోవిందా!” నినాదాలతో భక్తులు ఉత్సాహంగా స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు.ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం సమగ్రమైన ఏర్పాట్లు చేశారు. “నవ్వుతో నా భవిష్యత్తు” అనే థీమ్‌తో స్వామివారి అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. కోనసీమ గాలి అంతా భక్తి పరిమళంతో నిండిపోగా, వాడపల్లి తిరుమల శ్రీ వేంకటేశ్వరుని కృపాకటాక్షం అందరికీ వరదైనట్లు కనిపించింది.









# కూటమి ప్రభుత్వం ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తోంది

- కూటమిలో నాయకులు కలిసే ఉంటారు
- రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 11:**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నాయకత్వంలో ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలు చేస్తున్నామని టిడిపి సీనియర్ నాయకుడు, రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతున్నాయని, పరిశ్రమలు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు వస్తున్నారని గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. శనివారం గోరంట్ల తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విశాఖకు గూగూల్ తో సహా మూడు డేటా సెంటర్లు వస్తున్నాయని, లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషికి ప్రధాని మోడీ అండగా ఉండడంతో పారిశ్రామిక వేత్తలు రాష్ట్రానికి వస్తున్నారని గోరంట్ల పేర్కొన్నారు.

సూపర్ సిక్స్ సూపర్ సక్సెస్ అయిందని, తల్లికి వదనం, మహిళలకు ఉచిత బస్సు , ఆటో డ్రైవర్లకు రూ 15వేలు చొప్పున అందించామని, ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేటు పెంచడానికి ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులు కొనే యోచన చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని, ప్రజాసమస్యలను అసెంబ్లీ లో ప్రస్తావించి, తామే ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్నామని అన్నారు. వైసిపి వారు శాడిజ నాయకులని, ఎన్ని దుష్ప్రచారాలు చేసినా కూటమి ఐక్యతకు ఇబ్బంది లేదని ఆయన స్పష్టం చేసారు. పిపిపి విధానం తప్పని, తాము అడ్డుకుంటామని జగన్ అనడాన్ని గోరంట్ల విమర్శించారు. మెడికల్ కాలేజీలకు భూములు కేటాయించినా అన్నింటికీ నిధులు ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. పిపిపి కి ఇవ్వడం వల్ల వెయ్యి సీట్లు వస్తాయన్నారు. పిపిపి విధానం వ్యతిరేకిస్తున్న జగన్ గతంలో కృష్ణపట్నం పోర్టుల వంటివి ప్రయివేటుకు ఎలా ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. దోచుకున్న సొమ్మంతా ఖర్చు చేస్తూ 13ఏళ్ళ నుంచి బెయిల్ మీద తీరుగుతున్న రాజకీయ నాయకుడు దేశంలో ఎవరూ లేరన్నారు. .

ఆరోగ్యశ్రీకి , సీఎం రిలీఫ్ ఫండ్ కి సంబంధం లేదని, ఆరోగ్యశ్రీకి బడ్జెట్ లో కేటాయింపులు ఉంటాయని, సీఎం రిలీఫ్ ఫండ్ కి ఇతర నిధులు వస్తాయని అన్నారు. గత ప్రభుత్వ ఆరోగ్యశ్రీ బకాయిలు కూటమి ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. రూరల్ నియోజక వర్గంలో 212 మందికి రూ .2 కోట్ల 40లక్షలకు పైగా సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందించినట్లు చెప్పారు. రూరల్ నియోజక వర్గంలో మరో రూ .9 కోట్ల 20లక్షల రూపాయల పనులకు నిధులు విడుదల అయ్యాయని ఆయన చెప్పారు. అనంతరం సిటీ వార్డులకు చెందిన రాయుడు పద్మావతికి 35,028, కొప్పుల శేషారత్నంకు 47,786-, షేక్ మున్నీసా 25,655, గుంటి సత్యనారాయణకు 2,25,000, దేవరకొండ రమేష్ కు 45,000, పితాని సింహాచలం కు 35,000, కల్లేపల్లి యమునాకు 51,618-, కొణిజేటి మల్యాద్రికి 1,63,499, పేట దుర్గా గణేష్ కు 30,573, పందిరి వెంకట శ్రీదేవికి 3,25,000/-, వార్డుకు రజియా సుల్తానా కు 25,460 మొత్తం 11 మంది లబ్ధిదారులకు రూ.10,07,619/- లక్షల రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ వెలుగుబంటి సత్య ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, మార్ని వాసుదేవ్, మత్సేటి శివ సత్య ప్రసాద్, పండూరి అప్పారావు, నున్న కృష్ణ, తలారి మూర్తి, శీలం గోవింద్, కొప్పిశెట్టి చిన్ని, రొంపిచర్ల యాంటోని, ఏడాకుల వెంకటేశ్వరరావు, కక్కల రమేష్, చిట్టిబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో నైపుణ్యాల మెరుగుదలకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదం

ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**రావులపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 11:**విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత, ఆలోచనా శక్తి పెంపుదలకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతో దోహదం చేస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు.

శనివారం ఆయన రావులపాలెం సెయింట్ ప్యాట్రిక్ పాఠశాలలో విద్యార్థులచే నిర్వహించబడిన ఆర్ట్స్, సైన్స్, సోషల్, క్రాఫ్ట్ ఎగ్జిబిషన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన వివిధ ప్రాజెక్టులను, మోడల్స్‌ను ఎమ్మెల్యే ఆసక్తిగా పరిశీలించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ం

విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను ప్రదర్శించడానికి ఇటువంటి ఎగ్జిబిషన్లు అద్భుత వేదికలు. పుస్తకాలలో చదివిన అంశాలను ప్రాక్టికల్‌గా ప్రదర్శించడం ద్వారా విద్యార్థుల్లో విజ్ఞాన పిపాస పెరుగుతుంది. ఒకే ప్రదర్శనలో ఇన్ని విభిన్న అంశాలను చూడడం ఎంతో ప్రేరణాత్మకం," అన్నారు.ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాల పెంపుకి, ప్రాక్టికల్ అవగాహనకు దోహదం చేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. విజ్ఞానశాస్త్రం, సామాజిక అంశాలపై విద్యార్థులు రూపొందించిన మోడళ్లను వివరించిన తీరుపై ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు.

విద్యార్థుల మాటల్లో నమ్మకం, పనిలో చురుకుదనం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చైతన్యం మీ భవిష్యత్తు విజయానికి పునాది అవుతుంది," అని ఆయన విద్యార్థులను ప్రోత్సహించారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఎగ్జిబిషన్ విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు.

# అల్లూరి సీతారామరాజు నగర్ కి కరెంటు నీళ్లు ఇవ్వాలి




**టీ నర్సాపురం, పెన్ పవర్, అక్టోబర్ 11 :**అల్లూరి సీతారామరాజు నగర్ కి కరెంటు నీళు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో టీ నర్సాపురం అంబేద్కర్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహా కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు పత్రికలు ఉద్దేశించి మాట్లాడుతూ నీళ్లు ఇవ్వమని సాక్షాత్ హైకోర్టు తీర్పుఇచ్చినప్పటికీ ప్రజా ప్రతినిధులు ఎంపీ పుట్టా మహేష్ కరెంటు నీళ్ళమ్మని చెప్పినప్పటికీ దేవుడు వరమిచ్చినా పూజారి మోకాలు పెట్టినట్లుగా పంచాయతీ అధికారుల తీరుందని విమర్శించారు. తక్షణమే ఎస్ ఆర్ నగర్ కాలనీను టీ నర్సాపురం పంచాయతీలో కలిపి,గుర్తించి ఇంటి పన్నులు వేయాలని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఎంపీ పుట్టా మహేష్ మాట నిలబెట్టే విధంగా అల్లూరి సీతారామరాజు నగర్ త్రాగునీరు కరెంటు సమస్యను పరిష్కారం చేయాలని ఆయన తెలిపారు. 17 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఎస్సార్ నగర్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడకం కుమారి, బరగడ కుమారి, మంగ,ముత్తమ్మ,మడకం సుధారాణి,తదితరులు పాల్గొన్నారు.

# కోరుకొండ మండలం దోసకాయల పల్లి లో అగ్నిప్రమాదం..

- సుమారు 40 మేకలు సహా సర్వం కోల్పోయిన కుటుంబం
- తన సొంత డబ్బులు రూ. లక్ష ఆర్థిక సాయం ప్రకటించిన ఎమ్మెల్యే బత్తుల దంపతులు
- అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే బత్తుల భరోసా
- ప్రభుత్వం నుంచి నష్టపరిహారం తో పాటు రుణాన్ని మంజూరు చేయించేందుకు హామీ





**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 11:**దోసకాయలపల్లి లో జరిగిన అగ్ని ప్రమాదంలో మేకల మందను మేపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న జుత్తుగా సుబ్రహ్మణ్యం సర్వం కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సుమారు 40 మేకలతో పాటు ఇల్లు, గడ్డివాములు,సర్వం అగ్నికి ఆహుతి అయ్యాయి.ఈ దృశ్యాలు చూసి చలించి పోయిన ఎమ్మెల్యే బత్తుల తన సొంత డబ్బులు లక్ష రూపాయలను బాధిత కుటుంబానికి అందిస్తానని తెలిపారు. వారికి ధైర్యం చెప్పడంతో పాటు అగ్ని ప్రమాదం వల్ల సంభవించిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అలాగే మేకలను కొనుగోలు చేయడానికి అవసరమైన రుణాన్ని మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు.బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తెలిపారు.

# సి వి మార్కెట్‌ను తరలించడానికి వ్యాపారులు సిద్ధం

- గత ఐదేళ్లు పేపర్ మిల్లు కార్మికులు,వ్యాపారులను మోసగించిన మాజీ ఎంపీ
- తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు విమర్శ



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, అక్టోబర్ 11:**ఎంతో కాలంగా నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్య గా మారిన సీవీ కూరగాయల మార్కెట్ ను తరలించడానికి తాము సిద్ధమని తెలుగుదేశం పార్టీ నగర అధ్యక్షులు మజ్జి రాంబాబు చెప్పారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అధికారంలోకి రాగానే 15 నెలల్లో మార్కెట్ తరలింపు ప్రయత్నం ఫలించ దన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం మీడియా సమావేశంలో రాంబాబు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం హాయంలో మార్కెట్ ను తరలిస్తానని వ్యాపారులను భరత్ చాలా సార్లు తిప్పుకున్నాడని విమర్శించారు. ఆదిరెడ్డి వాసు కృషి వల్ల సీవీ మార్కెట్ నాలుగు ఎకరాల కార్పొరేషన్ స్థలం మిగిల్చారని అన్నారు. పుష్కర ఘాట్ వద్ద బ్యూటిఫికేషన్ పేరుతో పేర్చిన రాళ్ళల్లో అవినీతి జరిగిందని విజిలెన్స్ విచారణ లో తేలిందన్నారు. ఏపీ పేపరు మిల్లు కార్మికులకు ప్రయోజనాలను కాపడం లో మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ అధికారంలో ఉన్న సమయంలో ఎన్నో తప్పులు చేశారని రాంబాబు విమర్శించారు. మంచి అగ్రిమెంట్ చేయిస్తానని, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయిస్తానంటూ నమ్మబలికి లక్షలు దోచుకున్నాడని ఆరోపించారు. పేపరు మిల్లు పరంపర 1, 2 కార్మికులకు మాజీ ఎంపీ మార్గాని భరత్ అన్యాయం చేశాడని, ప్రవీణ్ చౌదరిని అడ్డుపెట్టుకుని కోట్ల అవినీతి, అక్రమాలు చేశారని ఆరోపించారు. మార్గాని భరత్ కు 50 లక్షలు ఇచ్చానని ప్రవీణ్ చౌదరీయే బహిర్గతం చేశారని పేర్కొన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పరంపర కార్మికులకు మంచి అగ్రిమెంటు చేయించారన్నారు. పేపరు మిల్లు సీఎస్సార్ నిధులతో కోటిలింగాల పేటలో కోటీ 25 లక్షలతో పంపు హౌస్ నిర్మించేలా చేశారన్నారు. భరత్ ప్రచార ఆర్భాటం తప్పా చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఈ మీడియా సమావేశంలో టీడీపీ నగర కమిటీ సభ్యులు బుడ్డిగ రాధా, ఉప్పులూరి జానకి రామయ్య, మొకమాటి సత్యనారాయణ, ద్వారా పార్వతి సుందరి, మహ్మద్ అస్లాం, బుడ్డిగ రవి, సలాది ఆనంద్, దుత్తరపు గంగాధర్, ఈతలపాటి రవి, బొర్రా చిన్ని, కందికొండ అనంత్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన జీఎస్టీతో అన్ని వర్గాల ప్రజలకు మేలు

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పై మంత్రి సుభాష్ ఇంటింటా ప్రచారం



**రామచంద్రపురం, పెన్ పవర్, అక్టోబర్ 11:**ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్యతరగతి ప్రజలకు విశేషంగా మేలు జరుగుతుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు.శనివారం రామచంద్ర పురం మండలంలోని వెలంపాలెం గ్రామంలో కూటమి పార్టీ నాయకు లతో కలిసి సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ పై ఇంటింటా ప్రచార అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,జీఎస్టీ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు, వ్యాపారులకు విస్తృతంగా తెలియ జేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశ మని తెలిపారు.జీఎస్టీ స్లాబులను తగ్గించడం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి సామాన్య ప్రజలకు ఊరట లభిస్తోందన్నారు. నూతన జీఎస్టీ సంస్కరణలు దేశ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.మంత్రి సుభాష్ మాట్లా డుతూ, ఈనెల 19వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా జీఎస్టీపై అవగాహన సదస్సులు, ర్యాలీలు, ప్రచార కార్య క్రమాలు నిర్వహిస్తా మని తెలిపారు. జీఎస్టీ 2.0 అమలుతో రాష్ట్ర ప్రజలకు సుమారు 8 వేల కోట్ల రూపాయల మేర ఆదా అవుతుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నామని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం రూరల్ మండలం టిడిపి అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, టేకుమూడి సత్యనారాయణ, పెంకే సాంబశివరావు, కామేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాస్, గోవిందు బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల క్షేత్ర చరిత్ర వెలికి తీయడం అభినందనీయం: - మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి

**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 11:** శ్రీశైల క్షేత్ర దశాబ్దాల చరిత్రను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం గంగవరం విచ్చేసిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైల భ్రమరాంభ, మల్లిఖార్జున స్వామి ఆలయం చరిత్ర ఆనాటి రాజకీయ, ఆర్థిక, సాంఘీక సాంస్కృతిక, మత పరమైన పరస్థితులను తామరపత్రాల్లో భద్రపరచం జరిగిందన్నారు. రెడ్డిరాజులు, రేచర్లసామంతులు, విజయనగరరాజులు, గజపతులు వంటి వివిధ రాజవంశీకులు చేసిన శాసనాలను అధ్యాయనం చేసి శ్రీశైల చరిత్రను పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. దీనిని ఈ నెల 16న రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చే శ్రీశైల దేవస్థానం వారు శ్రీ శ్రీశైల నూతన తామర శాసనాలు అనే గంధ్రాన్ని ఆవిష్కరించనున్నారని ఇది ఎంతో అభినందనీయమన్నారు.



# ఉద్యోగ మేళాలో 18 మంది ఎంపిక

- నిరుద్యోగ నిర్మూలనలో మంత్రి సుభాష్ కృషి ప్రశంసనీయం



**రామచంద్రపురం, పెన్ పవర్, అక్టోబర్ 11:**రామచంద్రపురం నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నిరంతరం కృషి చేస్తున్నారు. ఆయన ప్రేరణతో ప్రతి వారం నిర్వహిస్తున్న జాబ్ మేళా కార్యక్రమంలో భాగంగా శనివారం రామచంద్రపురంలోని ఉపాధి కార్యాలయంలో ఉద్యోగ మేళా నిర్వహించబడింది. ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలలో మొత్తం 18 మంది యువతులు, యువకులు ఎంపికయ్యారు. ఎంపికైన వారు త్వరలోనే హోసూర్‌లో విధులు చేపడతారని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యం, ఉపాధి ప్రాజెక్ట్ డైరెక్టర్ రామ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తగ్గించేందుకు జాబ్ మేళాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, యువతకు స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి కొనసాగు తుందని పేర్కొన్నారు. కంపెనీ ప్రతినిధులు సునీల్, జయంత్ తదితరులు ఎంపికైన అభ్యర్థులను అభినందించారు. ఉద్యోగం పొందిన 18 మంది యువత మంత్రి వాసంశెట్టి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, ఉపాధి బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# దొంగతనం కేసులో ముద్దాయి అరెస్ట్

- బంగారం, వెండి స్వాధీనం



**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 11:**కాజులూరు మండలం కోలంక గ్రామంలో జరిగిన దొంగతనం కేసులో ముద్దాయిని పోలీసులు పట్టుకుని దొంగిలించిన బంగారం, వెండిని రికవరీ చేశారు. గొల్లపాలెం పోలీస్ స్టేషన్ ఎస్సై ఎం. మోహన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, కోలంక గ్రామం గుబ్బలవారిపేటలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తి తాళం పగలకొట్టి ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి ఆభరణాలను దొంగిలించాడు. ఈ ఘటనపై గొల్లపాలెం పోలీస్ స్టేషన్‌లో సెక్షన్ 127/2025 అండర్ సెక్షన్ 331(4), 305(ఎ) బిఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు నిందితుడిని అదే గ్రామానికి చెందిన ప్రమిదల శ్రీను (35), తండ్రి అప్పారావు, కులం: శెట్టిబలిజ, గుబ్బలవారిపేట, కోలంక గ్రామం గా గుర్తించారు. శనివారం మధ్యాహ్నం కోలంక గ్రామ శివారు హైస్కూల్ సమీపంలో ముద్దాయిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి బంగారం 1.28 గ్రాములు, వెండి 334 గ్రాములు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మోహన్ కుమార్ తెలిపారు, కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ముద్దాయిని కోర్టులో హాజరు పరచనున్నామని పేర్కొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ బాలికల దినోత్సవం..

- బాలికల సంరక్షణ ... అందరి బాధ్యత...
- తోటపల్లిలో జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు.
- మెరుగైన సమాజం కోసం బాధ్యతగా ఉందాం.
- శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ వెంకట్, వైస్ ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మీ.



**ఎటపాక,పెన్ పవర్,అక్టోబర్ 11 :**బాలికల సంరక్షణ అందరి బాధ్యతని, సమాజంలో బాలికలపై జరుగుతున్న అకృత్యాలపై అవగాహన కల్పించాలని తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ వెంకట్ ప్రిన్సిపల్ రాజ్యలక్ష్మి అన్నారు. ఎటపాక మండలం తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ లో శనివారం జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇటీవల పరిస్థితులపై అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. అన్నీ రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని వివరిస్తూ అన్ని శాఖల పేర్లతో ప్లకార్డులు తయారు చేసి వాటిని చదువుతూ నినదించారు. ఆ స్థాయిలో ఎదగాలని ఉన్నత విద్య అభ్యసించాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికా, శ్రీనివాస్, అప్పాజీ, జ్యోతి, జ్యోత్స్న, నాగేంద్రమ్మ , వరలక్ష్మి, నమ్రత రమాదేవి శివాదేవి శ్రీను ఇమాన్సి, వెంకటలక్ష్మి, జయంతి, వాసవి, శివాని, తదితరులు పాల్గొన్నారు

# వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ



**జీలుగుమిల్లి ,పెన్ పవర్, అక్టోబర్ 11:** వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్సై వి క్రాంతి కుమార్ సూచించారు .శనివారం 516 డి జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి నియమ నిబంధనలు పాటించి జాగ్రత్తగా వెళ్లాలని అన్నారు. ఆటోలలో అధికంగా ప్రయాణికులను ఎక్కించకూడదని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు .

# చేనేత కార్మికులతో మంత్రి సుభాష్ చర్చలు సఫలం





## హామీతో దీక్ష విరమణ

**రామచంద్రపురం/ కపిలేశ్వరపురం అక్టోబర్ 11, పెన్ పవర్:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామంలో జరుగుతున్న చేనేత కార్మికుల రిలే నిరాహార దీక్షలు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీతో శనివారం ముగిశాయి. గత 13 రోజులుగా బకాయిలు విడుదల చేయాలంటూ శ్రీ గణపతి చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంత్రి సుభాష్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు జోక్యంతో సఫలమయ్యాయి. మంత్రి స్వయంగా దీక్షా శిబిరానికి వెళ్లి చేనేత సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి, నిమ్మరసం అందించి దీక్షలను విరమింపజేశారు. చేనేత సంఘాలకు ప్రభుత్వం చెల్లించవలసిన రూ.3.85 కోట్లు బకాయిలను ఒక నెలలోగా విడుదల చేయడానికి తాను కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అయితే ప్రస్తుత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కట్టుబడి ఉంది. మగ్గం నేత కార్మికులకు సంవత్సరానికి రూ.25 వేల ఆర్థిక సహాయం అందించాలన్న హామీని డిసెంబర్‌లోపు అమలు చేస్తాం" అని తెలిపారు. ఈ సందర్భంగా విజయనగరం ఆర్టీసీ మాజీ జోన్ చైర్మన్ నెక్కంటి బాలకృష్ణ, బీజేపీ నాయకులు కోన సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ, నామాల శ్రీనివాస్ రావు, ఛాత్రాతి జానకిరామయ్య తదితరులు నేతన్నలకు సంఘీభావం తెలిపారు. చేనేత సంఘ ప్రతినిధులు బందారు కొండయ్య, బాలా వీరభద్రుడు, ఉందారు సత్యనారాయణ, శివకుమార్, పోతబత్తుల విజయ్ కుమార్, దొంతంశెట్టి సత్యప్రకాశ్, ఆదివారం పేట సర్పంచ్ నక్కిన దొరబాబు, కూటమి నాయకులు అల్లక రాజు, కొండా పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం తోనే నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన



మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి

**గంగవరం, పెన్ పవర్ ,అక్టోబర్ 11:**రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి దక్కిందని మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.

అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గం గంగవరంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 15 నెలల్లో నాలుగు లక్షలు పైచిలుకు ఉద్యోగాలు పలు శాఖలలో కల్పించడం జరిగిందని, ఎన్నికల హామీలు 20 లక్షలు ఉద్యోగాలు నిరుద్యోగులకు కల్పిస్తామని ఇచ్చిన హామీని 15 నెలలలోనే నాలుగు లక్షల పైచిలుకు ఉద్యోగాలు ఇచ్చారంటే మిగిలిన పదవీకాలంలో ఎంత అభివృద్ధి చేస్తారనేది తేటతెల్లమవుతుందని ఆయన అన్నారు.

రాబోవు నాలుగు సంవత్సరాల్లో రాష్ట్రంలో నిరుద్యోగులకు మెండుగా ఉపాధి అవకాశాలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పిస్తారని ఆయన తెలిపారు. పదవి బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలి సంతకం చేసిన డీఎస్సీ ద్వారా 16 వేల ఉద్యోగాలను భర్తీ చేశారని అలాగే ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని యువనేత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ప్రకటించారని ఆయన అన్నారు. రానున్న కాలంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడతారని ఆయన అన్నారు.

# కంటి సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## వైద్య శిబిరంలో పలువురు వక్తలు సూచనలు






**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 11:** కంటి సమస్యల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి వాటిని సంరక్షించుకోవాలని పలువురు వక్తలు సూచించారు. సకాలంలో వైద్య సహాయం పొందితే ఎటువంటి ఇబ్బందులు లేకుండా కంటిని సంరక్షించుకోవచ్చునని వారు అన్నారు. ఆలమూరు మండలం పెదపళ్లలో శనివారం కపిలేశ్వరపురం ఎల్వి ప్రసాద్ కంటి ఆసుపత్రి, ఫ్రీడం ఆయిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని ఫ్రీడం ఆయిల్ ప్రతినిధి అంజలి రజదాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పెదపళ్ల తో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన 206 మందికి ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి వైద్యులు నిరంజన్ సత్యనారాయణ మహావీర్ లు కంటి పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 72 మందికి ఉచితంగా కళ్ళజోళ్ళు మరి కొంతమందికి కంటి ఆపరేషన్ చేయించడానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏడిద సత్య శ్రీ మెహర్ ప్రసాద్, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల సూర్య ప్రకాష్ రావు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి వేణి, కపిలేశ్వరపురం ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో అర్హులైన విద్యార్థులకు అన్యాయం

- ఉన్నత అధికారులకు
- పలు జిల్లాల కోచ్ లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు





**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 11**రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థిని, విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహణలో భాగంగా 69వ ఎస్ ఎస్ జి ఎఫ్ అంతర్ జిల్లాల బాక్సింగ్, ఉషూ పోటీలు స్థానిక ఎస్ కే వి టి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ మైదానంలో గత రెండు రోజులుగా జరుగుతున్నాయి. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల నుంచి సుమారు 1400 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు తూర్పుగోదావరి జిల్లా ఆతిథ్యం ఇస్తుంది. ఈ పోటీలు అండర్ 14 ,అండర్ 17 ,అండర్ 19 విభాగాల్లో బాలబాలికలు పాల్గొంటున్నారు. అయితే ఈ పోటీలకు రాష్ట్ర, జిల్లాల స్థాయి బాక్సింగ్ సంఘాల నుంచి వృత్తిపరమైన, సంబంధిత క్రీడారంగంలో నైపుణ్యత లేనివారితో నాణ్యత రహితంగా జరుగుతున్నాయని బాక్సింగ్ సంఘాల నాయకులు, కోచ్ ల నుంచి విమర్శలు వచ్చాయి. పోటీల ప్రారంభం రోజు శుక్రవారం బాల బాలికలకు ఆయా విభాగాల్లో పాల్గొనేందుకు బరువు ( వేయింగ్) లో కొంతమంది అర్హత కలిగిన విద్యార్థులను తప్పించారని పలు జిల్లాల కోచ్ లు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాక్సింగ్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వైవిఎస్ ఉమామహేశ్వరరావు, నంద్యాల జిల్లా కోచ్ ఫయాజ్ కాకినాడ జిల్లా కార్యదర్శి కృపారావు, పశ్చిమగోదావరి జిల్లా సెక్రెటరీ చిరంజీవి, తూర్పు గోదావరి జిల్లా కోచ్ భవాని శంకర్ , మనో కుమార్ లు మీడియాతో మాట్లాడుతూ 69వ బాక్సింగ్ ఫోటీలు అనర్హుల సమక్షంలో జరుగుతున్నాయని ఆరోపించారు. శుక్ర, శనివారం జరిగిన బరువు విషయంలో నిర్వాహకులు అవకతవకులకు పాల్పడ్డారని, దాంతో అర్హులైన ఎనిమిది మంది అర్హత కలిగిన బాలలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాణాలకు, నిబంధనలకు విరుద్ధంగా పోటీలు మండుటెండలో నిర్వహిస్తున్నారని దాంతో బాల బాలికలు ప్రమాదాల బారిన పడతారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఈ పోటీలను రద్దుచేసి మళ్లీ బాక్సింగ్ సంఘాల , వృత్తి నిపుణులతో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జోన్ 2 ఉమ్మడి గోదావరి జిల్లాల రీజినల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారి జాన్సన్ ను కలిసి అర్హులైన బాలలకు న్యాయం చేయాలని వారు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును తాను అమరావతి లోని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని బాధితులకు హామీ ఇచ్చారు

# గంగవరం చేరుకున్న శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి కార్తీక మాస మహోత్సవాల ప్రచార రథం





**గంగవరం పెన్ పవర్ అక్టోబర్ 11:** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం కార్తీక మహోత్సవాలు 2025 ప్రచార రథం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతా ప్రచారం చేసుకుంటూ శనివారం సాయంత్రం గంగవరం చేరుకుంది. ఈ సందర్భంగా దేవస్థానం సిబ్బంది మాట్లాడుతూ అన్నవరం సత్యదేవుడి కార్తీక మాస మహోత్సవాలు ఈనెల 22వ తేదీ నుండి నవంబర్ 20వ తేదీ వరకు అంగరంగ వైభవంగా సాగుతాయని అక్టోబర్ 17వ తేదీ మూల నక్షత్రం శుక్రవారం నుండి నవంబర్ 13వ తేదీ వరకు సత్య దీక్ష మాల ధారణ ఆచరించవచ్చని అన్నారు. నవంబర్ రెండవ తేదీ కార్తీక శుద్ధ ద్వాదశి రోజున రాత్రి 7 గంటల నుండి చెప్పవచ్చు శ్రీ స్వామి అమ్మవార్లకు పంప సరోవరంలో నౌకా విహారయాత్ర నిర్వహించడం జరుగుతుందని నవంబర్ 5వ తేదీ బుధవారం గిరి ప్రదక్షణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమాలలో భక్తజనం అందరూ పాల్గొని అన్నవరం సత్యదేవుడు కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రచార రథం లోని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# రామవరంలో భారీ అన్నదానం



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 11:** జగ్గంపేట మండలం రామవరం గ్రామం నేషనల్ హైవే పక్కన ఉన్న శ్రీ సత్తమ్మతల్లి అమ్మవారి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట జనసేన ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ హాజరై ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమయుక్త కార్యదర్శి బాలు సూరంపాలెం, ఎంపీటీసీ దొడ్డ శ్రీను, మండపాక పాపన్న దొర, మాదారపు వీరబాబు, మెహర్ బాబా, పిల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## జనార్ధన స్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 11:** ఆలమూరు లో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి వారి ఆలయంలో శనివారం ఉదయం శ్రీ స్వామి వారికి తొలి హారతి అంగరంగ వైభవంగా జరిగింది. భక్త జనంతో స్వామివారి ఆలయం కిటకిటలాడింది. అలాగే జొన్నాడ గ్రామ వాస్తవులు శ్రీ జనార్ధన భజన మండలివారిచే ఆలయంలో విష్ణు సహస్రనామం, లలిత సహస్రనామం, సౌందర్యలహరి. పారాయణం చేసినారు. స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ సభ్యులు దర్శనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# రాజ్యాంగాన్ని కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్క పౌరుడిది




**కేంద్ర మాజీమంత్రి పళ్లంరాజు**

**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 11:** రాజ్యాంగం మరియు ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకునే బాధ్యత ప్రతీ ఒక్క పౌరుడుదీనని కేంద్ర మాజీ మంత్రి, సిడబ్ల్యుసి సభ్యులు డాక్టర్ ఎంఎం పల్లంరాజు అన్నారు. ఓటర్ల జాబితా అవకతవకలు, ఎన్నికల కమిషన్ అక్రమాలపై జగ్గంపేట కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మరోతి శివ గణేష్ ఆధ్వర్యంలో శనివారం జగ్గంపేటలో ప్రజా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పల్లంరాజు హాజరై కార్యకర్తలు, నాయకులతో కలిసి ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపడుతూ ప్రజా మద్దతు కోరారు. అనంతరం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 41 వసంతాలు పూర్తి చేసుకున్న జి ఎస్.కె.ఎం న్యాయ కళాశాల







**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్, 11** రాజమహేంద్రవరం రూరల్ మండలం లోని పిడింగొయ్యి గ్రామం లో ఉన్న జి.ఎస్.కె.ఎం న్యాయ కళాశాల 41 వసంతాలు పూర్తి చేసుకున్నది . ఈ సందర్భంగా ఇదే కాలేజీ లో న్యాయవాద కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందించే స్నాతకోత్సవం కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమం లో పాల్గొన్న రాజమండ్రి రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఏ.ఎం.సీ చైర్మన్ మార్ని వాసుదేవ్, ప్రముఖ సీనియర్ న్యాయవాది ముప్పాళ్ళ సుబ్బారావు, కాలేజీ డైరెక్టర్ శరత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రీయ దృక్పధాన్ని అలవర్చడం కోసం జన విజ్ఞాన వేదిక కృషి అభినందనీయం



**ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు**

**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 11:** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముఖి సైన్స్ సంబరాలు -2025 పోస్టర్స్ ను శనివారం గంగవరం లో ఏజన్సీ జిల్లా విద్యాశాఖాధికారి వై మల్లేశ్వర రావు , మండల విద్యాశాఖాదికారి -2 టి. మల్లేశ్వరరావు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్బంగా వారిరువురు మాట్లాడుతూ విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచి పెంచడం, శాస్త్రీయ దృక్పధాన్ని అలవర్చడం మూఢ నమ్మకాలను పారద్రోలడం కోసం గత 35 యేండ్లు గా జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు.

ఈ కార్యక్రమం లో జన విజ్ఞాన వేదిక అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు టి. బొజ్జియ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె కృష్ణ, ఎం. వెంకన్న దొర మహిళా అధ్యక్షురాలు రుక్మిణి, యాట్ల సత్యనారాయణ,దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలమూరు శ్రీ జనార్ధన స్వామిని దర్శించుకున్న అనుశ్రీ ఫిలిమ్స్ అధినేత

అనుశ్రీ దంపతులకు ఘన స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు.



**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 11:** ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో ప్రఖ్యాతి పొందిన నవ జనార్ధన ఆలయాల్లో ప్రముఖమైన ఆలమూరులో వేంచేసి ఉన్న శ్రీశ్రీదేవి, భూదేవి సమేత శ్రీజనార్ధనస్వామి ఆలయాన్ని జనసేన పార్టీ రాజమహేంద్రవరం సిటీ ఇంచార్జ్, అనుశ్రీ ఫిలిమ్స్ అధినేత, ఫిలిం డిస్టిబ్యూటర్ అత్తి సత్యనారాయణ (అనుశ్రీ) తన సతీమణి అనురాధదేవితో కలిసి దర్శించారు. ఆలయకమిటీ చైర్మన్ బైరిశెట్టి రాంబాబు ఆధ్వర్యంలో సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా అనుశ్రీ దంపతులు స్వామి వారికి దర్శనం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక వాతావరణంలో నెలకొని ఉన్న స్థానిక జనార్ధన స్వామి దర్శనం తమకు ఎనలేని సంతృప్తిని అందించిందని అనుశ్రీ అన్నారు. అనంతరం ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య అనుశ్రీ దంపతులకు ఘనంగా సత్కారం జరిగింది. నల్లా వెంకన్న, చల్లా బాబి, వెలుగుబంటి వెంకన్న, అయినవిల్లి శ్రీనివాస్, బొబ్బా రాంబాబు, చిన్నం సుబ్బలక్ష్మి, దారా దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సేవే మానవతా ధర్మం గా పాటించాలి

- దివ్యంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఏ.వై. శ్రీనివాస్



**రాజమహేంద్రవరంపెన్ పవర్ అక్టోబర్ 11**

ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక లాలాచెరువు లోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమం ప్రాంగణంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఏ.వై. శ్రీనివాస్ మాట్లాడుతూ

వృద్ధుల సంరక్షణ చట్టం వారి హక్కులను కాపాడటానికి ప్రభుత్వం అనేక మార్గదర్శకాలు రూపొందించిందన్నారు. వృద్ధుల సమస్యల పరిష్కారానికి ఆర్డీవో స్థాయి అధికారులతో ప్రత్యేక ట్రైబ్యునల్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాల సమస్యల పరిష్కారానికి శాఖపరంగా నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం తరం తరం మధ్య అనుబంధాన్ని గుర్తు చేసే రోజు అన్నారు. వృద్ధులు మన సమాజానికి జ్ఞానానికి ప్రతీకలు, అనుభవానికి నిలయాలు అన్నారు. వారు చూపిన మార్గమే మన అభివృద్ధికి ఆధారమని, వారి సేవలను గౌరవించడం, వారిపట్ల ఆప్యాయత చూపడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత అన్నారు. వృద్ధుల సంక్షేమం అంటే కుటుంబ, సమాజ, ప్రభుత్వ బాధ్యతల సమన్వయం ు వృద్ధుల ఆశీర్వాదం ఉన్న చోట సద్భావన, సుస్థిర అభివృద్ధి సహజంగానే సాకారం అవుతాయన్నారు. ఈ సందర్భంగా విభిన్న రంగాల్లో విశేష సేవలు అందించిన వయోవృద్ధులకు 'బెస్ట్ సీనియర్ సిటిజన్ అవార్డులు'ను శ్రీనివాస్ ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలైన విశ్రాంత డిప్యూటీ జనరల్ మేనేజర్, టెలికం కె.వి. చలపతిరావు

ఆలంబన సంస్త నిర్వాహకురాలు కొల్లి భాగ్యలక్ష్మి, సి.పి. రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ మేడపాటి ధర్మారెడ్డి,

విశ్రాంత రైల్వే ఉద్యోగిని చల్లా రాజేశ్వరి,

స్వర్ణాంధ్ర ఉపాధ్యక్షులు బొప్పన నాగేశ్వరరావు, పూలే సామాజిక చైతన్య వేదిక నిర్వాహకులు నయనాల కృష్ణారావు,

లను సత్కరించారు. జిల్లా ఉత్తమ వృద్ధాశ్రమ నిర్వహణ విభాగంలో స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంకు అవార్డు ప్రధానం చేశారు.


ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బి. సత్యనారాయణ రాజు, స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ నిర్వాహకులు లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ వి. రాజు, సీనియర్ సిటిజన్స్ సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

# జగ్గంపేటకు చేరుకున్న అన్నవరం సత్యనారాయణ స్వామి ప్రచార రథం



**జగ్గంపేట, పెన్ పవర్, అక్టోబర్ 11:** అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం కార్తీక మహోత్సవాలు 2025 ప్రచార రథం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంతా ప్రచారం చేసుకుంటూ జగ్గంపేట చేరుకుంది. ఈ రథానికి రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు) ఘన స్వాగతం పలికి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ అన్నవరం సత్యదేవుడి కార్తీక మాస మహోత్సవాలు ఈనెల 22వ తేదీ నుండి నవంబర్ 20వ తేదీ వరకు అంగరంగ వైభవంగా సాగుతాయని అక్టోబర్ 17వ తేదీ మహా నక్షత్రం శుక్రవారం నుండి నవంబర్ 13వ తేదీ వరకు సత్య దీక్ష మాల ధారణ ఆచరించవచ్చని అన్నారు. నవంబర్ 5వ తేదీ బుధవారం గిరి ప్రదక్షణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారన్నారు.

# పంతం కుటుంబంలో పెళ్లి సంబురం





**సీఎం, పవన్ కళ్యాణ్ హాజరు**

**కాకినాడ రూరల్, పెన్ పవర్, అక్టోబర్ 11**:కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కుమారుడు, జనసేన యువనేత పంతం సందీప్ – శ్రీలేఖ వివాహం విజయవాడ మంగళగిరిలోని సి.కె. కన్వెన్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ వేడుకకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు ముఖ్య అతిథులుగా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు.పవన్ కళ్యాణ్ రాగానే "ఓజీ ఓజీ పవర్ స్టార్" అంటూ జనసైనికులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.వివాహ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుండి నాయకులు, ప్రజాప్రతి నిధులు, జనసైనికులు వేలాదిగా తరలివచ్చారు. గోదావరి జిల్లాకు చెందిన సానా సతీష్ బాబు, తోట త్రిమూర్తులు, పేరా బత్తుల రాజశేఖర్, తంగేళ్ల ఉదయ శ్రీనివాస్, నారా లోకేష్, బాలకృష్ణ, కొండబాబు, వరుపుల సత్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

## బిలాల్ మసీదు పున నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయం :ఎమ్మెల్యే ఆదిరెడ్డి



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, అక్టోబర్, 11** :బిలాల్ మసీదు పున నిర్మాణానికి కావాల్సిన అన్ని అనుమతులు వచ్చేలా చేస్తానని, మసీదు నిర్మాణానికి తన వంతు ఆర్థిక సహాయం అందిస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు పరిష్కారం లభించడంతో నగరానికి చెందిన ముస్లిం మైనారిటీలు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక 4వ డివిజన్ రాజేంద్రనగర్‌లో ఉన్న బిలాల్ మసీదును పునర్మించేందుకు అక్కడి మసీదు కమిటీ నిర్ణయించింది. అందుకు సంబంధించిన ప్లాన్ అప్రూవల్ ఇతర తతంగాలు పూర్తి చేసేందుకు పొజిషన్ సర్టిఫికెట్ కాల్సివచ్చింది. ఈ విషయాన్ని మసీదు కమిటీ, స్థానిక టీడీపీ పెద్దలు నక్కా చిట్టిబాబు, నక్కా దేవీవరప్రసాద్, ముస్లిం మైనారిటీ నాయకులు మహ్మద్ అబ్దుల్లా తదితరులు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పొజిషన్ సర్టిఫికెట్ వచ్చేలా చేశారు. దాంతో ముస్లిం మైనారిటీ నాయకులు, మసీదు కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు నగర టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

- ఆలమూరు ఎస్సై జి నరేష్..




**ఆలమూరు, పెన్ పవర్, అక్టోబర్ 11**:రోజురోజుకు సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి నరేష్ సూచించారు.శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.మండలంలోని ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగహన పెంచుకుని, మరికొందరికి అవగాహన కల్పించాలన్నారు. చదువుకున్న వాళ్లు కూడా ఇటీవల సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. కొరియర్ పేరుతోనూ మోసాలు జరుగుతున్నాయని, చైల్డ్‌ఫోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్టులు, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీట్రాప్, లాటరీల పేరుతోను, డిబెట్ కార్డు మోసాలు, వీడియోకాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్ మెయిలింగ్ తదితర నేరాలకు పాల్పడుతున్నారన్నారు.ఇటీవల సోషల్ మీడియాలోని వాట్సాప్ వేదికగా ఎస్బిఐ,రైతు భరోసా వంటి సేవా కేంద్రాలకు ఏపీకే యాప్ ఇన్స్టాల్ చేసుకుని మీ యొక్క ఆధార్ కార్డు, పాన్ కార్డ్ ను లింక్ చేసుకోవాలంటున్నారని, ఇలా యాప్ లు ఇన్స్టాల్ చేయడం వల్ల మీయొక్క ఫోన్ హ్యాక్ చేసి పర్సనల్ డేటాను దొంగలిస్తూ కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. స్మార్ట్ ఫోన్లు మంచి కోసం ఉపయోగించుకుంటే జీవితం సాఫీగా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో ఫేక్ ఫొటోలను చూసి ఆకర్షణకులోనై మోసపోకూడదన్నారు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి ఎక్కువగా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంకు ఖాతాలకు స్ట్రాంగ్ పాస్వర్డును సెట్ చేసుకుని సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నెంబరు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్లో డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ. సైబర్ క్రైమ్. గవర్నమెంట్.ఇన్ ఫిర్యాదులు చేయాలని ఎస్సై సూచించారు.

## నిధులు సమకూర్చిన ఎంపీడీవోకు కృతజ్ఞతలు -సర్పంచ్ దేగల తిరుమల వేణి



**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 11**:కాజులూరు మండలం బంధనపూడి గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఎంపీడీవో జయ రాంబాబు నిధులు సమకూర్చినందుకు గ్రామ సర్పంచ్ దేగల తిరుమల వేణి కృతజ్ఞతలు తెలిపారు.గ్రామంలో తాగునీటి సమస్యలు, మౌలిక సదుపాయాల లోటు వంటి అంశాలను సర్పంచ్ దేగల తిరుమల వేణి, ఆమె కుమారుడు దేగల నాగేంద్ర ప్రసాద్ (ఎన్‌ఆర్‌ఐ) కలిసి ఎంపీడీవో జయ రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎంపీడీవో జె. రాంబాబు గ్రామంలో తాగునీటి సరఫరా మెరుగు పరచేందుకు తగిన నిధులు కేటాయించి చర్యలు ప్రారంభించా రు.ఈ సందర్భంగా సర్పంచ్ దేగల తిరుమల వేణి తెలిపారు ు "గ్రామ ప్రజలు ఇబ్బంది పడకుండా తాగునీటి సదుపాయం కల్పించేందుకు చొరవ తీసుకున్న ఎంపీడీవో కి మన గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాను" అని అన్నారు.తనయుడు, జనసేన నాయకుడు దేగల నాగేంద్ర ప్రసాద్ కూడా ఎంపీడీవోను ప్రత్యక్షంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## చైర్ పర్సన్ రాణి పరామర్శ.



**మండపేట.పెన్ పవర్. అక్టోబర్ 11** :మాతృవియోగం తో బాధపడుతున్న కపిలేశ్వరపురం వైస్సార్సీపీ నాయకులు కొరిపెళ్ల సుబ్బారావు ను మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరామర్శించారు.శనివారం కపిలేశ్వరపురం లో వారి స్వగృహంలో కలిసి పరామర్శించారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.అనంతరం నిడసనమెట్ట గ్రామంలో సతీ వియోగంతో బాధపడుతున్న సేనక్కాయల త్రిమూర్తులు ను పరామర్శించారు.ఈ కార్యక్రమంలో మండల జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు,పార్టీ మండల అధ్యక్షుడు గూటం సత్య నారాయణ,కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్,ఐ టి వింగ్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు,పార్టీ ప్రెసిడెంట్ కట్టా మురళి కృష్ణ,ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు,పిప్పర సంపత్ రావు,ప్రచార కమిటీ కన్వీనర్ వంగా శ్రీనివాస్,సొసైటీ మాజీ చైర్మన్ పెంటపాటి వెంకన్నబాబు,జిల్లా కార్యదర్శి మరివాడ సూరిబాబు,పార్టీ కమిటీ మెంబర్ పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కేశవరంలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు ఆలయ నిర్మాణం.



- ఎమ్మెల్యే వేగుళ్ళ శంఖుస్థాపన .

**మండపేట. పెన్ పవర్.అక్టోబర్ 11** :మండపేట మండలం కేశవరం గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారు నూతన ఆలయ నిర్మాణం కు శనివారం రాష్ట్ర అంచనాల కమిటి చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శంఖుస్థాపన చేశారు. తొలుత ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొబ్బరికాయ కొట్టి శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కర్రి తాతరావు, కేశవరం సొసైటి ప్రెసిడెంట్ ఉండమట్ల శ్రీనివాస్, ఉండమట్ల సురేష్, ఎంపిపి ఉండమట్ల శ్రీనివాస్, పోతురాజు ఆలయ కమిటీ చైర్మన్ ఆళ్ళ రాజబాబు, ఉండమట్ల తాతాజి, ఉండమట్ల పాపారావు, కంటిపూడి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సీతారామస్వామి దేవస్థానం చైర్మన్ గా చిక్కాల.




**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 11:** శ్రీ సీతారామ స్వామి దేవస్థానం చైర్మన్ గా చిక్కాల శ్రీనివాస లక్ష్మణరావు శనివారం నియమితులయ్యారు. మండల పరిధి లింగంపర్తి గ్రామంలో గల శ్రీ సీతారామ స్వామి దేవస్థానం నూతన కమిటీ చైర్మన్గా చిక్కాల శ్రీనివాస్ లక్ష్మణరావు ను నియమిస్తున్నట్లు ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శనివారం ప్రకటించారు.వైస్ చైర్మన్ గా పెంటకోట పద్మరాణి , నూతన కార్యవర్గ సభ్యులు గా కోట జానకి, కీలు సత్యవేణి , బుగతా సుగుణ , పితాని మాధురి, మెలిపాక నాగేంద్ర, మద్దిల రాజేష్, ఉడతల వీరవెంకట రమణారావు, వింజరపు సత్య రామ గోపాల్ అర్చకులు ( ఎక్స్ – ఆఫీసియో మెంబర్) గా నియమించబడ్డారు.ఎన్ డి ఏ కూటమి తరపున నియమించబడిన నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే సత్య ప్రభ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## జిల్లా బిజెపి అధ్యక్షునికి ముస్లిం మైనార్టీల సత్కారం.



**మండపేట. పెన్ పవర్.అక్టోబర్ 11** :మండపేట టిడిపి ముస్లిం మైనార్టీ లు జిల్లా బిజెపి అధ్యక్షులు అడబాల సత్యనారాయణ ను సత్కరించారు.మండపేట లో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మండపేట కలువపువ్వు సెంటర్ లోని జామియా మస్జిద్ షాపింగ్ కాంప్లెక్స్ లో ఉన్న రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ కార్యదర్శి సల్మాన్ హుస్సేన్ షాప్ కు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ను మండపేట తెలుగుదేశం పార్టీ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ఎండి కరీం ఖాదరి స్వాగతం పలికి దుశాలువతో సత్కరించారు.జాతీయ అధికారిక భాష హిందీ సలహా కమిటీ సభ్యులు షంసు సాదిక్, చాట్రాతి జానకి రాంబాబు లొల్ల,బీజేపీ రాజోలు నియోజకవర్గం కన్వీనర్ అడబాల రాంబాబు, సల్మాన్ హుస్సేన్ పాల్గొన్నారు.

## నిత్యావసర వస్తువులపై జీఎస్టీ భారాన్ని తగ్గించిన ఎన్డీఏ ప్రభుత్వం



**ఎలా -ఎమ్మెల్యే వనమాడి కొండబాబు**

**కాకినాడ, పెన్ పవర్, అక్టోబర్ 11:**నూతన జీఎస్టీ 2.0 సంస్కరణలతో పన్ను శ్లాబులను తగ్గించి, నిత్యావసర వస్తువులపై భారాన్ని తగ్గించడం ద్వారా పన్నుల వ్యవస్థను మరింత సులభతరం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు.శనివారం నగరంలోని భానుగుడి సెంటర్ వద్ద జరిగిన సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా కొండబాబు వ్యాపార వర్గాలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాత పన్ను శ్లాబులు (5శాతం ,12శాతం ,18శాతం, 28శాతం) స్థానంలో కొత్తగా సరళమైన రెండు శ్లాబులు అమల్లోకి వచ్చాయని వివరించారు.5శాతం మెరిట్ రేటు నిత్యావసర వస్తువులకు వర్తించడంతో వాటిపై పన్ను భారం తగ్గిందని, కొన్ని వస్తువులపై జిఎస్టీ పూర్తిగా రద్దు చేయబడిందని తెలిపారు.ముఖ్యంగా వైద్య సామాగ్రిపై జిఎస్టీ పూర్తిగా రద్దు చేయడం, ఆరోగ్య మరియు జీవిత బీమా పాలసీలపై 18% జీఎస్టీ మినహాయింపు ఇవ్వడం పేద, మధ్యతరగతి ప్రజలకు విశేష లబ్ధి చేకూరుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, బచ్చు శేఖర్, గదుల సాయిబాబా, గుమ్మల్ల వెంకటేశ్వరరావు, పిన్నమ్మరెడ్డి బుజ్జి, బొల్లోజు ఉమామహేశ్వరరావు, వీరం రెడ్డి వెంకటలక్ష్మి, అంబటి చిన్న, సుంకర శ్రీను, మూడే రాజుబాబు, కే. ప్రసాద్, పల్లా సురేష్, కలిదిండి సురేష్, నాయుడు, నానావరపు సుబ్రహ్మణ్యం, సాదే సత్తిబాబు, సత్యప్రసాద్, ముత్యాల రాణి, వి.బాబ్జి, పసుపులేటి వెంకటేశ్వరరావు, గోపిశెట్టి భూరయ్య, పినపోతు రాము, మనోహర్ గుప్త, పెనపోతు జీవారత్నం, పాలిక నాని, సంఘాని నాగేశ్వరరావు, మల్లాడి రాజు, పులుపుకూర శ్రీనివాసరావు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

# కోనసీమ తిరుమల వాడపల్లిలో ఆర్డీవో శ్రీకర్ దంపతుల భక్తి దర్శనం





**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 11:**కోనసీమ త్రివేణి సంగమమైన వాడపల్లి తిరుమలలో శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాల ఘనోత్సవాలు భక్తిజనసంద్రంగా సాగుతున్నాయి.
ఈ పుణ్యపర్వ సందర్భంలో శనివారం కొత్తపేట ఆర్డీవో శ్రీ పి. శ్రీకర్ గారు దంపతులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు.
సకల యజ్ఞముఖ్యుడైన శ్రీ వాడపల్లి వెంకన్న దర్శనంతో ఆర్డీవో దంపతులు క్షణక్షణాన ఆనందభాష్పాలతో తడిసి భక్తి పరవశమయ్యారు.
స్వామివారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించిన అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్ర ఘోషల మధ్య వేదాశీర్వచనం చేశారు.
తీర్థప్రసాదాలను స్వీకరించిన శ్రీకర్ దంపతులు స్వామివారి దివ్యచరితను స్మరించుకున్నారు.
ఈ సందర్భంగా ఆలయ అధికారులు ఎన్.ఎస్. చక్రధరరావు, స్వామివారి దివ్య చిత్రపటాన్ని భక్తిశ్రద్ధలతో ఆర్డీవో దంపతులకు అందజేశారు.
ఆలయ ప్రాంగణం అంతటా భక్తిజన నినాదాలు, మంగళవాయిద్యాలు మార్మోగుతూ ఆధ్యాత్మిక పరవశాన్ని సృష్టించాయి.
శ్రీవారి అనుగ్రహంతో కోనసీమ భూమి సమృద్ధిగా వర్ధిల్లాలని, ప్రజలు శాంతి, సంతోషాలతో క్షేమంగా ఉండాలని స్వామివారి సన్నిధిలో శ్రీకర్ దంపతులు ప్రార్థించారు.

## శబరిమలకి పాదయాత్రగా ధర్మవరం అయ్యప్ప స్వాములు






**ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్ 11 :** శబరిమల సన్నిధానానికి అయ్యప్ప స్వాముల భక్తి పాదయాత్ర భక్తి సంద్రంలా సాగింది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం నుండి ఏడు మంది అయ్యప్ప దీక్షాపరులు డాక్టర్ బొల్లు గంగాధర్ గురు స్వామి ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమం స్వర్గీయ దండపాణి గురు స్వామి వారి దివ్య ఆశీస్సులతో, వేలు గురు స్వామి, అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ జాతీయ అధ్యక్షులు చంటి గురు స్వామి, దాడి నాగపుత్రయ్య గురు స్వామి ఆశీస్సులతో భక్తి భావపూర్వకంగా జరిగింది. అయ్యప్ప శరణు ఘోషల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, బొల్లు గంగాధర్ గురు స్వామి దీక్ష పూర్తి చేసిన స్వాములకు ఇరుముడి కట్టారు. ఈ సందర్భంగా పాదయాత్రలో పాల్గొంటున్న పోకనాటి రాఘవేంద్ర స్వామి, సతీష్ స్వామి, రాజశేఖర్ గురు స్వామి, నానాజీ గురు స్వామి, అర్జున్ స్వామి, అలాగే పెద్దిపాలెం గ్రామం నుండి కొండలరావు స్వామి, సింహాద్రిపురం గ్రామం నుండి ఈశ్వరుడు గురు స్వామి ఒక భక్తి బృందంగా ఏర్పడి శబరిమల వైపు బయలుదేరారు. పాదయాత్రకు శుభాకాంక్షలతో చంటి గురు స్వామి పూలమాలలు వేసి, దుస్సాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. శబరిమల యాత్ర విజయవంతంగా పూర్తవ్వాలని ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవకులం టీమ్ సభ్యులు రామకుర్తి సత్యరాజ స్వామి, గుగ్గిలపు శ్రీనివాస్ తదితరులు పాల్గొని అయ్యప్ప శరణు ఘోషలతో వాతావరణాన్ని భక్తిమయంగా మార్చారు.

## ఘనంగా ఓట్ చోర్,గద్ది చోడ్,పోస్టర్,ఆవిష్కరణ



-కాంగ్రెస్,పార్టీ మండలఅధ్యక్షులు లీలాకృష్ణ,

**వి.ఆర్.పురం పెన్.పవర్.అక్టోబర్.11**
ఆంధ్రప్రదేశ్,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వై.యస్. షర్మిలరెడ్డి,జిల్లా కాంగ్రెస్ పార్టీ అరకుపార్లమెంట్ అధ్య క్షులు శతక బుల్లిబాబు,ఆదేశాల మేరకు ఓట్ చోర్,గద్ది చోడ్,పోస్టర్,ఆవిష్కరణ మండలంలోని వి.ఆర్.పురం మండల కాంగ్రెస్ పార్టీఅధ్యక్షులు అండిమేని లీలాకృష్ణ
నాగేంద్రప్రసాద్,మండలనాయకులుఆధ్వర్యంలో ఘనం గా ఆవిష్కరణచేశారు.ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అండిమేని లీలాకృష్ణ నాగేంద్ర ప్రసాద్, మాట్లాడుతూ బిజెపీ పార్టీ అక్రమంగా ఓటర్ల జాబితా నుండి ఓటర్లను తొలగిస్తున్న నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఓటర్లు ఉద్యమించాలని,పిలుపునిచ్చారు.కాంగ్రెస్, పార్టీ మద్దతుతో సెప్టెంబ ర్15 వ.తేది నుండి అక్టోబర్.15వ. తేదీవరకు సంతకాల సేకరణ కార్యక్రమం చేపడుతుందని. మండల కాంగ్రెస్ పార్టీనాయకులు కార్యకర్తలు,అభిమాను లు జరగబోవు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, బిజెపి పార్టీ అవలంబిస్తున్న దోరణి అక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని,కోరారు.ఈ కార్య క్రమంలో మండల కాం గ్రెస్ పార్టీ అధ్యక్షులు అండిమేని లీలాకృష్ణ కృష్ణ నాగేంద్ర ప్రసాద్,కాంగ్రెస్ పార్టీ మండలనాయకులు కడుపు సత్య నారాయణ(క్రాంతి)సయ్యద్,సర్పరాజు,కుంజా రమేష్, మడకం జాన య్య,తెలం సాయిబాబు,కారందేవ రాజు, కుంజా గాంధీ,దుర్గారావు,మడకం ముత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

## నేటి బాలికలే రేపటి సాధికారత మహిళలు



**అంబాజీపేట, పెన్ పర్, అక్టోబర్, 11:**బాలబాలికలకు తల్లిదండ్రులు అండగా ఉండి సంరక్షించుకోవాలని సిహెచ్ వో బి. అప్పారావు అన్నారు. అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు.
కిమ్స్ వైద్యులు డా. సతీష్ , డా. రెహ్మ లు నేటి బాలిక లే రేపటి సాధికారత మహిళలు కార్యక్రమం పై అవగాహన కల్పించారు. గంగలకుర్రు సమీకృత బాలుర వసతి గృహంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.
చర్మవాధులు, చిన్నచిన్న వ్యాధులు, దోమలవలన వాటల్లే జ్వరాలు గురించి అవగాహన కల్పించారు. . ఈ కార్యక్రమం లో హాస్టల్ వార్డెన్, పిహెచ్ సి సిబ్బంది ఆశా కార్యకర్త లు పాల్గొన్నారు.

# కుమ్మరి కులవృత్తిదారుల సంక్షేమం పట్ల కృషి- చైర్మన్ పేరేపి ఈశ్వర్

ప్రభుత్వ పథకాలు ప్రతి చేతివృత్తిదారుని దాకా చేరేలా కృషి





**ప్రత్తిపాడు, పెన్ పవర్, అక్టోబర్ 11 :**రాష్ట్రంలోని కుమ్మరి–శాలివాహన చేతివృత్తిదారుల సంక్షేమం కోసం ప్రభుత్వ పథకాలు అందుబాటులోకి తీసుకురావడమే తమ లక్ష్యమని, ఆ దిశగా ప్రతి జిల్లా స్థాయిలో చురుకుగా పనిచేస్తున్నామని ఏపీ కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ తెలిపారు. శనివారం కాకినాడ జిల్లా పర్యటనలో భాగంగా ఆయన స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ డైరెక్టర్ భీమా వత్తుల సత్య నారాయణ, కాకినాడ కుమ్మరి శాలివాహన సంఘ అధ్యక్షుడు పసలపూడి ప్రసాద్ రావు, కార్యదర్శి దాలిపర్తి శ్రీనివాసరావు తదితర సంఘ పెద్దలు చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. తరువాత ఈశ్వర్ బోర్డ్ క్లబ్ వద్ద గల శాలివాహనుల ఆడపడుచు కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, "కుమ్మరి వృత్తి ఆధారంగా జీవించే కుటుంబాలకు మట్టి సరఫరా, పనిముట్లు, పరికరాలు, నిధులు సమకూర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడతాం. 50 ఏళ్లు నిండిన వారికి సామాజిక భద్రతా పింఛన్లు అందేలా, ప్రతి జిల్లాలో కుమ్మరి %–% శాలివాహన భవనం ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి ప్రతిపాదనలు సమర్పించాం" అని తెలిపారు. తరువాత ఆయన సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట, నీలాద్రిరావుపేట ప్రాంతాల కుమ్మరి%–%శాలివాహన వృత్తిదారులను కలసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డి. ప్రకాష్ రావు, విశ్వనాథం, దుర్గాప్రసాద్, న్యాయవాది చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన రుచికర భోజనం అందించాలి



**అంబాజీపేట, పెన్ పవర్, అక్టోబర్ 11:**మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన రుచికర భోజనం అందించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. గంగలకుర్రులో ఉన్న ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వసతి గృహంలో కిటికీలకు ఉన్న మెస్లు సక్రమంగా లేవని వాటి వల్ల దోమలు లోలపకు వచ్చే అవకాశం ఉన్నందున విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. తక్షణమే మెస్లను ఏర్పాటు చేయాలన్నారు. వంట చేసే ప్రాంత మంతా సంపూర్ణ పారిశుద్ధ్యంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులకు సమయపాలన పాటిస్తూ విద్యతో పాటు భోజనం ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీపీ వెంట ఎంపీటీసీ నెల్లి వెంకటేశ్వరరావు ఉన్నారు.

# యువతి ప్రేమించటం లేదని యువకుడు ఆత్మహత్యా యత్నం

**అంబాజీపేట,పెన్ పవర్, అక్టోబర్11:**గత కొన్ని నెలలుగా ఒక యువతిని ప్రేమించమని వెంట పడి వేధిస్తున్న ఒక యువకుడు ఆ యువతి నిరాకరించడంతో గొంతుకోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అంబాజీపేట కు చెందిన ఒక యువతి బి.ఎస్సీ నర్సింగ్ చదువుతూ అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తోంది. ఆ యువతిని మండలంలోని ఇరుసుమండ కు చెందిన ఎస్.పవన్ అనే యువకుడు గత కొంత కాలంగా ప్రేమించమని వెంట పడి వేధిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం స్థానిక బస్ స్టేషన్లో పవన్ ఆ యువతితో ప్రేమ విషయమై మాట్లాడాడని అయితే ఆ యువతి నిరాకరించడంతో బ్లేడ్ తో గొంతుకోసుకున్నాడని స్థానికులు తెలిపారు.సమాచారాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ కు తెలపడంతో హెచ్.సి,పి.వి.వి.ఎస్.ఎన్. మూర్తి సంఘటనా స్థలానికి చేరుకొని పవన్ ను వైద్య చికిత్స నిమిత్తం అమలాపురం తరలించారు.

## డాక్టర్ గూడూరిని కలిసిన యువ కార్యకర్తలు



**కొవ్వూరు, పెన్ పవర్, అక్టోబర్ 11:**రానున్నది జగనన్న కార్యకర్తల ప్రభుత్వమని, జగనన్న కార్యకర్తలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని వైఎస్ఆర్సిపి రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. శనివారం పలువురు యువ కార్యకర్తలు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ పట్ల అభిమానంతో యువత జగనన్నకు బాసటగా నిలవాలని, మళ్లీ జగనన్నను సీఎం చేసేందుకు అవిశ్రాంతంగా కృషి చేయాలన్నారు. పార్టీ సంస్థాగత పటిష్టతలో భాగంగా ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ గుర్తింపు కార్డు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసి జగనన్నకు, పార్టీకి మంచి పేరు తీసుకురావాలన్నారు. వైఎస్ఆర్సిపి ప్రజాపక్ష పోరాటాలతో ప్రజల్లో ఉండాలని చెప్పారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ను మర్యాదపూర్వకంగా కలిసిన వారిలో యువ నాయకులు పొడి నాగేంద్రబాబు, కొవ్వూరు మండల సోషల్ మీడియా కన్వీనర్ చరణ్, నాని బాబు, సిహెచ్ రాజశేఖర్, బి కిరణ్, కె అనిల్, బి హరీష్ తదితరులున్నారు.

## టర్ల్ వన్ అండ్ టూ దిగ్విజయంగా ముగింపు





**వై రామవరం,పెన్ పవర్, అక్టోబర్ 11 :** విద్యార్థులలో అభ్యసన సామర్థ్యం పెంపొందించేందుకు నిర్వహించిన టర్ల్ మొదటి రెండవ దపా శిక్షణ కార్యక్రమం దిగ్విజంగా ముగిసింది అని డిఆర్పీలు తెలిపారు.
ఈ కార్యక్రమం ఈనెల ఆరో తేదీ నుండి 11వ తేదీ వరకు నిర్వహించిన సందర్భంగా చివరి రోజు ముగింపు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. మండలంలో పనసల పాలెం హై స్కూల్ గెజిటెడ్ హెడ్మాస్టర్ ఎం.అప్పలనాయుడు, డి ఆర్ పి లు ఎం. రామకృష్ణ,పి లక్ష్మణ్ రెడ్డి,అందాల బుల్లబ్బాయి రెడ్డి, ఎంఈఓ 2 ఎం జోగేశ్వరరావు సన్మానించడం జరిగిందని తెలిపారు. కోర్స్ ఇన్చార్జిగా వ్యవహరించి అన్ని సౌకర్యాలు కల్పించిన ప్రధానోపాధ్యాయుల వారి సేవలకు ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఎంఈఓ 2 ను సన్మానించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ 2 మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరూ విద్యార్థుల స్థాయిలను పెంచుటకు కృషిచేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# ఓటర్ల జాబితాలో పారదర్శకతకు కాంగ్రెస్ సంతకాల సేకరణ





- ప్రత్తిపాడులో మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు, జిల్లా నేతల సంతకాల సేకరణ
- ర్యాలీగా వెళ్ళి ప్రజలకు అవగాహన కల్పించిన కాంగ్రెస్ నేతలు

**ప్రత్తిపాడు, అక్టోబర్ 11పెన్ పవర్,** ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం భాగంగా శనివారం ప్రత్తిపాడులో కాంగ్రెస్ నాయకులు ప్రజలతో కలిసి సంతకాల సేకరణ చేపట్టారు.
సెప్టెంబర్ 15 నుండి అక్టోబర్ 15 వరకు దేశవ్యాప్తంగా సాగుతున్న ఈ ఉద్యమంలో భాగంగా, అంబేద్కర్ కళామందిర్ సెంటర్ నుండి మెయిన్ రోడ్డు వరకు నాయకులు ర్యాలీగా వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఓటర్ల జాబితా సక్రమంగా ఉండాలంటూ ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమానికి మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు, కాకినాడ పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ మల్లిపూడి శ్రీ రామచంద్రమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా ఉపాధ్యక్షులు ధరణాలకోట శ్రీను అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పల్లం రాజు మాట్లాడుతూ, "ఫోటోలతో కూడిన ఓటర్ల జాబితా ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఎన్నికలకు ముందు జరిగే మార్పులు, చేర్పులు పారదర్శకంగా ప్రకటించాలి. ఓటర్ల తొలగింపుల్లో తప్పులు దొర్లితే వాటిని సరిచేసే ఫిర్యాదు వ్యవస్థ ఉండాలి. చివరి నిమిషంలో ఓట్ల తొలగింపులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నీరుకొండ సత్యనారాయణ (ప్రత్తిపాడు ఇన్‌ఛార్జ్), జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొప్పున కోటేశ్వరరావు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మొయ్యటి సూర్యప్రకాశ్, ఉమ్మడి సురేష్, కొల్లు వీరగణేష్, దాసర సత్తిబాబు, కందిమల్ల శామ్యూల్, ఇరుగుల చక్రం తదితర నాయకులు పాల్గొన్నారు.

## శనిదేవుని అనుగ్రహం కోసం మందపల్లికి భక్తుల తాకిడి



**కొత్తపేట,పెన్ పవర్,అక్టోబరు11:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ మందేశ్వర స్వామి (శనీశ్వర స్వామి ) దేవస్థానం నందు శనివారం భక్తిశ్రద్ధలతో తైలాభిషేకములు, అర్చనలూ, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించబడినవి.
ఈ సందర్భంగా భక్తులు విరివిగా హాజరై శనీశ్వర స్వామి వారికి నైవేద్యాలు సమర్పించి, తైలాభిషేకములు నిర్వహించారు. శ్రద్ధాభక్తులతో పాల్గొన్న భక్తుల విరాళాల ద్వారా తైలాభిషేకముల రూపంలో 1,24,155రూపాయలు అలాగే అన్నప్రసాదం విరాళాలుగా 24,176 రూపాయలు అందాయి.మొత్తం వెరసి 1,48,331 ఆదాయం లభించింది.దేవస్థాన అభివృద్ధి కోసం భక్తులు చూపుతున్న విశ్వాసం, సేవాభావం ప్రశంసనీయమని, ఆలయ నిర్వహణ పారదర్శకంగా కొనసాగుతున్నదని కార్యనిర్వహణాధికారి సహాయక మిషనర్ దారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.

## ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేయాలి...

- ఆదివాసి చట్టాలు పై సెమినార్






**కూనవరం,పెన్ పవర్,అక్టోబర్ 11.**బిర్సా ముండా జయంతి ఉత్సవాల సందర్భంగా సెమినార్ మండలంలోని భాస్కరా టాకీస్ నందు నిర్వహించారు.ఆదివాసి సంక్షేమ పరిషత్ 3898/90, ఆదివాసి టాప్ టెన్ టీం,ఆదివాసి టీచర్స్ అసోసియేషన్,ఆదివాసి ఉద్యోగ సంక్షేమ పరిషత్ సంఘాల ఆధ్వర్యంలో ఆదివాసి హక్కులు చట్టాలు పై సెమినార్ ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షులు కారం రవి మాట్లాడుతూ 5వ షెడ్యూల్ ఏజెన్సీ భూభాగంలో ఆదివాసి నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన కోసం ఏజెన్సీ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం చేసి ఆదివాసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని ప్రభుత్వని కోరారు.గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముర్రం వీరభద్రం మాట్లాడుతూ ఆదివాసి హక్కులు,చట్టాల అమాలు కై ఆదివాసి యువత సంఘటితంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని తెలిపారు. సెమినార్ కు విచ్చేసిన పలువురు మాట్లాడుతూ కోయ భాష, సాంస్కృతిక,సంప్రదాయాలు ఆదివాసీలకు గుర్తింపును ఇస్తాయని, ఆదివాసి పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలని,యువత నిరుద్యోగులు గ్రామీణ స్థాయిలో ఆదివాసి పెద్దలకు వివరించి చట్టాలు అమలు కొరకు నిర్మాణాత్మకమైన ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు సోడే ముత్తయ్య,మినప నాగేశ్వరావు,పాయం లక్ష్మణరావు, ధర్మల రాంబాబు,కారం కన్నారావు, మల్లం ఆనంద్,తెల్లం సురేష్,కుంజా శ్రీను,కూర నారాయణ,సోయం లక్ష్మణ్ రావు,సోడే మురళి,నూప అనిల్, వెంకటేశ్వర్లు,తెల్లం నాగరాజు,తెల్లం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ - సూపర్ జిఎస్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముప్పిడి



**తాళ్ళపూడి, పెన్ పవర్, అక్టోబర్ 11:**మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో నిర్వహించిన జిఎస్టీపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి జిఎస్టీపై అవగాహన కల్పించిన కొవ్వూరు నియోజకవర్గ శాసన సభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ ను సూపర్ హిట్ చేశారని పేర్కొన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలలు రోజు వాడే వస్తువులపై జిఎస్టీ తగ్గించి పేదలకు కొంత భారం తగ్గించాలనే ఉద్దేశంతో 373 రకాల వస్తువుల మీద జిఎస్టీ తగ్గించరన్నారు. ప్రాణావసర మందులు, ఇన్స్యూరెన్స్ వంటి వాటి మీద తగ్గింపుతో ఆనందంలో ప్రజానీకం ఉందని తెలిపారు. ఈ తగ్గింపుతో ప్రజల అవసరాలు తీరటంతో పాటు ఆర్థికంగా బలవంతులను చేయటమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఇప్పటిదాకా పన్నులు పెంచే ప్రభుత్వాలే తప్ప పన్నులు తగ్గించే ప్రభుత్వం మొదటిసారి చూస్తున్నాం అని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లూరి విక్రమాదిత్య, జి.వి.ప్రసాద్, కొఠారు వెంకట్రావు, చెవ్వూరి బంగార్రాజు, కాకర్ల సత్యేంద్ర ప్రసాద్, కూచిపూడి గణపతి, చెవ్వూరి రాము, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## సాయి నగర్ లో ఎస్ ఎలైజా ఆధ్వర్యంలో డైమండ్ జూబ్లీ మహోత్సవం.







**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 11:** స్థానిక దిబ్బల పాలెం సాయి నగర్ లో ఎస్ ఎలైజా ఆధ్వర్యంలో డైమండ్ జూబ్లీ మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. దేవుని పరిశుద్ధ మందిరంలో 60వ డైమండ్ జూబ్లీ మహోత్సవాలను మందిర సంఘ కాపరి ఎస్ ఎలైజా దైవ సేవకుల సమక్షంలో కేక్ కట్ చేసి కార్యక్రమం ప్రారంభించారు.ఈసందర్భంగా ఎలైజా మాట్లాడుతూ దేవుని పరిశుద్ధ మందిరం వ్యవస్థాపకులు దివంగత జాకబ్ జాన్ స్థాపించి ఇప్పటికీ 60 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా డైమండ్ జూబ్లీ మహోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలను చైతన్య పరిచి, సత్ప్రవర్తన గల సేవకులుగా మార్చడానికి తన తండ్రి అయిన జాకబ్ జాన్ కాలినడకన,సైకిల్ తొక్కుకుంటూ ఏజెన్సీ ప్రాంతాలకు,సుదూర ప్రాంతాలకు వెళ్లి సువార్త చెప్పడం జరిగిందని అన్నారు.ఈ డైమండ్ జూబ్లీ మహోత్సవాల్లో పాస్టర్లు జాన్ పిన్ని, ఎస్.ఎలీషా,జాన్ విల్సన్,ప్రవీణ్ పాల్, కె.పాల్ ప్రసాద్,ప్రభాకర్,ఆస్మాండ్,వసంత ప్రసాదరావు,అలమండ వెంకట దుర్గా ప్రసాద్, కోరాడ ప్రసాద్,వాస ఫిలిప్,ప్రజా ప్రతినిధులు,దైవ సేవకులు పాల్గొన్నారు.

## ఇసుక లారీలతో పాడైపోతున్న రోడ్లు...

- ఈ రోడ్లపై ప్రయాణం నరకప్రాయము...
- అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.



**ఎటపాక,పెన్ పవర్,అక్టోబర్ 11:**మండల పరిధిలోని కన్నాయిగూడెం నుంచి ఎటపాక వరకు ఉన్న ఆంధ్ర సరిహద్దు రాష్ట్రీయ రహదారి ఇసుక లారీల రాకపోకలతో పూర్తిగా పాడైపోతుంది,నిత్యం వందలాది ఇసుక లారీలు తెలంగాణ రాష్ట్రం చర్ల మండలం నుంచి హైదరాబాదుకు రవాణా జరుగుతుంది, ఆ ఇసుక లారీలు అధిక బరువులతో కన్నాయిగూడెం నుంచి ఎటపాక మీదుగా తెలంగాణ రాష్ట్రానికి వెళ్లడంతో మన రాష్ట్రానికి చెందిన కొంతమేర సుమారు 5,6 కిలోమీటర్ల రాష్ట్రీయ రహదారి పూర్తిగా పాడైపోతుంది, ఈ రహదారిపై వాహనదారులు ప్రయాణం చేయాలంటే ప్రాణాలను అరి చేతిలో పట్టుకొని ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని స్థితిలో ఉన్నారు,ఈ ఇసుక లారీల రవాణాతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహన రహకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది, ఈ గోతుల్లో ప్రయాణం చేయాలంటే వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారు, సంబంధిత అధికారులు ఈ రోడ్లపై దృష్టి పెట్టి సమస్యను పరిష్కరిస్తే ఎంతోమంది ప్రాణాలు కాపాడిన వారు అవుతారని ప్రజలు కోరుకుంటున్నారు.

## నేడే ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణకు పరిటాల శ్రీరామ్ రాక..

రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి..



**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 11:** మునికూడలి గ్రామానికి ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పరిటాల శ్రీరామ్ ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు విచ్చేయుచున్నారు. ఈ సందర్భంగా బూరుగుపూడి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు బొబ్బిలి లంక నుండి మునికూడలి వరకు భారీ బైక్ ర్యాలీగా శ్రీరామ్ కి ఘన స్వాగతం పలుకుతున్నామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు రాజానగరం నియోజకవర్గంలో ఉన్న మూడు మండలాల నుండి నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా పాల్గొంటారని చైర్మన్ తెలిపారు.

## గోనేడ లో ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు.





**కిర్లంపూడి, పెన్ పవర్, అక్టోబర్ 11:**కిర్లంపూడి మండలం మండలం గోనేడ గ్రామం శివాలయం ప్రాంగాణంలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు.బిజెపి సీనియర్ నాయకులు, గోనేడ ఎంపీటీసీ మెంబర్ అల్లు శివరామకృష్ణ సభ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా తోట సర్వారాయుడు , ప్రధాన వక్తలుగా ఆర్ వి వి సత్య లింగేశ్వరరావు,ఎం వి వి రమణ పాల్గొన్నారు.రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ చాలక్ మోహన్ భాగవత్ జీ ఇచ్చిన పిలుపుమేరకు గోనేడ శివాలయం ప్రాంగణంలో శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. తొలుత సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ హెగ్డే వార్, గురూజీ, భారతమాత చిత్రపటాలకు పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించి, కాషాయ ధ్వజాన్ని ప్రతిష్టించి ధ్వజ ప్రణామం చేసారు.ఈ సభా కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ప్రధాన వక్తలు ఆర్ వి వి సత్య లింగేశ్వరరావు, ఎం వి వి రమణ మాట్లాడుతూ 1925 విజయదశమి రోజున మహారాష్ట్ర నాగపూర్ లో డాక్టర్ జి కేవలం కొద్ది మంది సభ్యులతో ప్రారంభించిన ఆర్ఎస్ఎస్, అనేక ఆటుపోట్లను ఎదుర్కొని దినదిన ప్రవర్ధమానమై ఇంతింతై వటుడింతై అన్నట్లుగా దేశవ్యాప్తంగా వేలాది శాఖలు లక్షలాదిమంది స్వయం సేవకులు, వేలమంది ప్రచారకులతో అనేక రంగాలలో సంఘ అనుబంధ విభాగాలు ఏర్పాటు చేసి, దేశ ప్రగతిలో భాగస్వామ్యమైందన్నారు. దేశంలో క్లిష్ట పరిస్థితులు ఏర్పడినప్పుడు ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ధైర్యంగా ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు అందించడంలో స్వయం సేవకులు ముందు నడుస్తారన్నారు. ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశించకుండా దేశం కోసం పనిచేసే సుశిక్షితులైన క్రమశిక్షణ కలిగిన నిబద్ధత కలిగిన కార్యకర్తల కృషివలన సంఘం బలీయమైన శక్తిగా ఎదిగిందన్నారు.భవిష్యత్తులో శక్తివంతమైన భారతదేశ నిర్మాణానికి ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిర్లంపూడి మండలం బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు, మండల బిజెపి పూర్వ అధ్యక్షులు యడాలి రాంబాబు, కిర్లంపూడి మండలం బిజెపి ప్రధాన కార్యదర్శి కంటా కాశీ విశ్వనాథం, తామరాడ ఎంపీటీసీ మెంబర్ గోకేడ రాజబాబు,దొడ్డా అప్పారావు, బోనగిరి కాశీ విశ్వనాథం, బుద్ధ సత్యనారాయణ,బొడ్డేటి బాబురావు, బొడ్డేటి చిన్నబ్బాయి, ఆడారి రామచంద్రరావు, పప్పుల రాంబాబు, కిర్లంపూడి విజ్ఞాన భారతి స్కూల్ ప్రిన్సిపల్ గాడి శ్రీనివాసరావు, పెంద్యాల నాగేశ్వరరావు వెంకటేశ్వరరావు , నాగేశ్వరరావు,భారీ ఎత్తున ఆర్ఎస్ఎస్ సభ్యులు, మాతృమూర్తులు, హిందూ బంధువులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ ఉడతా అప్పారావుకు పలువురు పరామర్శ.



**కిర్లంపూడి,పెన్ పవర్,అక్టోబర్11:**సీనియర్ జర్నలిస్ట్,ది కిర్లంపూడి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఉడతా అప్పారావుకు శనివారం పలువురు ప్రజాప్రతినిధులు పూర్వవిద్యార్థులు,పాత్రికేయమిత్రులు,పరామర్శించారు.అప్పారావు మాతృమూర్తి ఉడతా నూకాలమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న 1985-1986 సంవత్సరంలో అప్పారావుతో చదువుకున్న పదో తరగతి పూర్వవిద్యార్థులు విషయం తెలుసుకుని శనివారం అప్పారావు స్వగ్రహానికి చేరుకొని అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని సంతాపన్ని తెలియజేసారు.వారితో పాటుగా పలువురు ప్రజాప్రతినిధులు,పాత్రికేయ మిత్రులు అప్పారావు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపన్ని తెలియజేసారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు, మండల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శరకణం రాజబాబు, వైస్ ఎంపీపీ బొడ్డేటి గణపతి, నక్కా అప్పలరాజు,అప్పారావు పూర్వ స్నేహితులు అనిల్ పార్కింగ్ టైల్స్ అధినేత సేనాపతి కన్నబాబు,గొంప రామకృష్ణ,గొడే బుజ్జి,గొడే శేఖర్,ఎల్ఐసి బుజ్జి,గంటా రామకృష్ణ,గొంప లక్ష్మీనారాయణ,దాడి కాశీ,గ్రంధి చిట్టి,గుద్దాటి ఆనందరావు, దొడ్డి పైడిరాజు, ఎస్,ఎల్,వి విద్యా సంస్థల ప్రతినిధి కొల్లా సూరిబాబు,గుద్దాటి ఆనందరావు,మల్ల నాగుతోపాటు మీడియా ప్రతినిధులు,పెంటకోట సాయి,తుమ్మల సుబ్బు,శరకణం నాగేంద్ర,నేదూరి లక్ష్మణరావు, నేదూరి చిన్న, మద్రా చిట్టిబాబు,మురా చంటి,బత్తిన సత్యనారాయణ,యనమల జ్యోతిబాబు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

# బీజేపీ అధ్యక్షునికి సత్కారం.



**కపిలేశ్వరపురం పెన్ పవర్ అక్టోబర్ 11:** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ కపిలేశ్వరపురం, అంగర గ్రామాల్లో శనివారం పర్యటించి ప్రజా సమస్యలడిగి తెలుసుకున్నారు. అంగర లో ఉదయం 14 రోజులుగా చేనేత కార్మికులు చేస్తున్న నిరసన దీక్షకు సంఘీభావం తెలిపారు. అనంతరం చేనేత కార్మికుల దీక్ష విజయవంతం అయిన సందర్భం గా వారిని అభినందించారు.కపిలేశ్వరపురం లో మండల బీజేపీ అధ్యక్షుడు నామాల శ్రీనివాసు స్వగృహాని ఆ రాగా ఘనంగా స్వాగతం పలికి గ్రామస్తులతో సమక్షంలో ఘనంగా సత్యనారాయణ ను సన్మానించారు. మండపేట బీజేపీ నాయకులు కెవివి సాయిరాం, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరంపూడి సత్యనారాయణ, జానకిరామయ్య, తోరం రాము యు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లిపూడి పశు వైద్యశాల

**జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక. అప్పన్నబాబు కి గౌరవ డాక్టరేట్**



**గంగవరం, పెన్ పవర్, అక్టోబర్ 11 :** గత ఇరవై ఎనిమిది సంవత్సరాలు గా పశు సంవర్ధక శాఖ లో పని చేస్తూ మూగ జీవాల సేవకు అంకితమై వృత్తి పట్ల అంకిత భావంతో, నిస్వార్ధంగా మూగ జీవాలకు సేవాలందించినందుకు గుర్తింపు గా నెల్లిపూడి గ్రామీణ పశు వైద్యశాల లో జూనియర్ వెటర్నరీ అధికారిగా పనిచేయుచున్న పరిశిక అప్పన్నబాబు కి గౌరవ డాక్టరేట్ ను ఢిల్లీకి చెందిన డాక్టర్ ఎంబీ ఆర్ యూనివర్సిటీ, శనివారం ఢిల్లీ లో ప్రధానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ మొట్ట మొదటిగా నాకిష్టమైన వృత్తి వ్యాయామ ఉపాధ్యాయుడి గా 1993 లో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి నా తండ్రి ఆశయమైన మూగ జీవాలకు సేవ చేసుకునే భాగ్యం వారి కోరిక మేరకు వ్యాయామ ఉపాధ్యాయ వృత్తిని వదిలి పశు సంవర్ధశాఖ లో ప్రవేశించి 1995 లో శిక్షణ పొంది 1997 లో గ్రామీణ పశువైద్యశాల, నెల్లిపూడి లో వెటర్నరీ అసిస్టెంట్ గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి తర్వాత బదిలీ పై రాజవొమ్మంగి 2004 లో అమలాపురం బదిలీ పై వెళ్లిన నాకు నా పై అధికారుల పర్యవేక్షణ లో వృత్తిపరంగా ఎంతో నేర్చుకున్నానని వృత్తిపరంగా నాపై అక్కడ రైతులు చూపించిన అభిమానం, ఆప్యాయతలు మరువలేనివని ఇక 2011 లో లైవ్ స్టాక్ అసిస్టెంట్ గా పదోన్నతి పొంది కృష్ణా జిల్లా లో పనిచేటప్పుడు అప్పటి కృష్ణా జిల్లా జాయింట్ డైరెక్టర్, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ గా పనిచేస్తున్న డాక్టర్. దామోదర నాయుడు ఒక సమావేశంలో ఏదైనా పని చేస్తే దానికి ప్రతిఫలం ఆశించే మనం, ఆపనిని చిత్తశుద్ధి తో చేసినపుడే దానికి అర్థం అని వారు అన్న మాటలు నాలో వృత్తిపరంగా స్ఫూర్తి ని కలిగించాయని, ఈ వృత్తిలో వారే నాకు ఆదర్శప్రాయులని అదే విదంగా 2017 లో జూనియర్ వెటర్నరీ అధికారిగా పదోన్నతి పై రాజోలు, అపై పెద్దాపురం లలో పనిచేసి 2022 సాధారణ బదిలీలలో నా జన్మస్థానమైన అల్లూరి జిల్లా కి అందునా నా మొదటి ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన నెల్లిపూడి లో నియామకం జరగడం ఒక గిరిజన బిడ్డగా గిరిజన ప్రాంత ప్రజలకు నా వంతు సేవలందిచడం నా అదృష్టం గా భావిస్తున్నానని పశు సేవయే పరమాత్మ సేవగా భావిస్తూ ఈ అవార్డు రావడం ఆనందంగా ఉందని మరియు వృత్తిపరంగా మరింత బాధ్యత పెంచిందని ఈ అవార్డు కొరకు నన్ను ప్రోత్సహించిన నా సోదరులు పరిశిక వెంకటేశ్వరరావు ( విశ్రాంత బ్యాంకు అధికారి ) పరిశిక ప్రకాశరావు ( విశ్రాంత పబ్లిక్ ప్రాసిక్యూటర్ )పరిశిక మోహనరావు ( సీనియర్ అసిస్టెంట్ ) కి ఋణపడి ఉంటానని అలాగే నాకు వృత్తిపరంగా సహాయ సహకారాలు అందించిన నా పై అధికారులకు, నా సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఆయనకు గౌరవ డాక్టరేట్ రావడం పట్ల మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు అభినందనలు తెలిపారు.

# "అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే"

- జనసేన యువనేత డాక్టర్ దేగల నాగేంద్ర ప్రసాద్
- కుయ్యేరు గ్రామంలో సత్తెమ్మ తల్లి యంత్ర ప్రతిష్ఠోత్సవం ఘనంగా నిర్వహణ
- ఆలయ నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం అందజేసిన జనసేన నాయకుడు





**కాజులూరు, పెన్ పవర్, అక్టోబర్ 11:** కాజులూరు మండల పరిధిలోని కుయ్యేరు గ్రామంలో శ్రీ చోడిశెట్టి వారి సత్తెమ్మ తల్లి ఆలయ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు, గ్రామ ప్రజలు, దాతలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.ఇటీవలి కాలంలో ఆలయ నిర్మాణం ప్రారంభమైన సందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు, కమిటీ సభ్యులు విరాళాలు సేకరించగా, బందనపూడి గ్రామ సర్పంచ్ దేగల తిరుమల వేణి తనయుడు, జనసేన యువనేత, డాక్టర్ దేగల నాగేంద్ర ప్రసాద్ (డిఎన్ఎఫ్ ఫౌండేషన్ అధినేత) రూ.2 లక్షల నగదు విరాళాన్ని నగదు రూపంలో ఆలయ కమిటీకి అందజేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ప్రజా ప్రతినిధులు,ప్రము ఖులు హాజరయ్యారు.డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ కుటుంబ సమేతంగా సత్తెమ్మ తల్లి ఘటం, యంత్ర ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. స్థానిక యువత ఆయనతో ఫోటోలు దిగేందుకు ఆసక్తి కనబరిచారు.తరువాత మాట్లాడుతూ డాక్టర్ దేగల నాగేంద్ర ప్రసాద్ ఇలా అన్నారు %-%"అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే.మనం ఏది సాధించాలన్నా ఆమె అనుగ్రహం తప్పనిసరిగా ఉండాలి.గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగాకోరుకుంటున్నా" అని తెలిపారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దేగల నాగేంద్రతో పాటు, ఆయన తల్లిదండ్రులు దేగల సత్య నారాయణ%-%తిరుమల వేణి దంపతులను ఘనంగా సత్కరించా రు.కార్యక్రమం ముగింపులో భక్తులకు అన్నదానంనిర్వహించగా, సత్తెమ్మ తల్లి ఘటానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా నమస్కరించారు.

# రొమ్ము క్యాన్సర్ పై గ్రామస్థాయి అవగాహన అవసరం అడ్వకేట్ దివ్య ప్రసాద్



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 11** :మహిళల్లో పెరుగుతున్న రొమ్ము క్యాన్సర్ వ్యాధి పట్ల గ్రామస్థాయిలోనే విస్తృత అవగాహన అవ సరమని విశాఖ జిల్లా కలెక్టర్ సతీమణి, ప్రముఖ న్యాయవాది దివ్య ప్రసాద్ పేర్కొన్నారు.

అక్టోబర్ నెలను "పింక్ మంత్"గా జరుపుకుం టూ, రొమ్ము క్యాన్సర్ అవగాహన కార్యక్రమాన్ని కేజీహెచ్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. శిల్ప ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మహిళ ఏడాదికి కనీసం ఒక్కసారి వైద్య పరీక్ష లు చేయించుకోవాలని సూచించారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌పై అవగాహనతో పాటు, మెమోగ్రామ్ సహా అన్ని రకాల పరీక్షలు కేజీహెచ్‌లో ఉచితంగా అందుబాటులో ఉన్నా యని తెలిపారు. మహిళల ఆరోగ్యం సక్రమంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుంది కాబ ట్టి ఆరోగ్య పరీక్షల్లో నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు.రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. బుజ్జిబాబు మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స సులభం. కేజీహె చ్‌లో లభిస్తున్న ఉచిత వైద్య సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి అని అన్నారు.తదుపరి దివ్య ప్రసాద్, డాక్టర్ శిల్పతో కలిసి ఆంకాలజీ విభాగంలో చికిత్స పొందుతు న్న రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్య సిబ్బందిని అభినందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ శిల్ప, సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణిని దివ్య ప్రసాద్ సత్కరించారు. అనంతరం సిఎస్ఆర్ బ్లాక్ ముందు పింక్ బెలూ న్లు ఎగరేసి క్యాన్సర్ అవగాహనకు సంకేతంగా కార్యక్రమాన్ని ముగించారు.

# కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహ కార్తీక మాస వన సమారాధనకు ఎమ్మెల్యే సమక్ష..





**కోరుకొండ, పెన్ పవర్, అక్టోబర్ 11**:కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కార్తీకమాసం నెల రోజులపాటు గత ఏడాది మాదిరిగానే 'మహా అన్న సమారాధన' భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తెలియజేశారు. శనివారం కోరుకొండ స్వామివారి ఆలయం వద్ద కల్యాణ మండపంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్పీ రంగరాజు బట్టర్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే బలరామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా స్వామి వారి ఆలయంలో స్వామి వారి ఆలయంలో ఎమ్మెల్యే బలరామకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు దేవస్థానం అధికారులు ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అతి పవిత్రమైన కార్తీక మాసం నెలరోజుల పాటు స్వామివారి ఆలయం వద్ద గత ఏడాది సమారాధన విజయవంతంగా నిర్వహించమన్నారు. అదేవిధంగా ఈ ఏడాది కూడా భారీ స్థాయిలో అన్న సమారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి అన్నారు. ఆ నెల రోజులపాటు స్వామి వారి ఎగువ, దిగువ ఆలయాల్లోను, కొండ మెట్ల పొడవునా కార్తీకదీపం ఆరాధనలు భక్తుల, గ్రామస్తుల సహకారంతో కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గత ఏడాది మాదిరిగానే శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి సేవా కమిటీ సీనియర్ భక్తులు, కూటమి నాయకుల అందరితోనూ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన భక్తులు, సందర్శకులు అందరికీ స్వామి వారి అన్న ప్రసాదం అందే విధంగా సేవా కమిటీ స్థానిక నాయకులు, గ్రామస్తులు కృషి చేయాలని ఎమ్మెల్యే బలరామకృష్ణ పేర్కొన్నారు. త్వరలోనే టిడిపి ఇన్చార్జ్, 'రుడా' చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, రాజనగరం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి అందరితో కలిసి మరొక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు.

# ఏలేశ్వరంలో అన్నవరం దేవస్థానం కార్తీకమాసం మహోత్సవాల పై ప్రచారం.





**ఏలేశ్వరం, పెన్ పవర్, అక్టోబర్ 11**: శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం కార్తీక మాసంలో నిర్వహించబోయే కార్యక్రమాలపై ఏలేశ్వరం మండలంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కార్తీక మాస మహోత్సవములు - 2025 పేరిట ముద్రించిన కరపత్రాలను భక్తులకు అందజేశారు.

అన్నవరం దేవస్థానం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రాజా రోహిత్ సౌజన్యంతో అన్నవరం దేవస్థానం కార్యా నిర్వహణా అధికారి వీర్ల సుబ్బారావు విడుదల చేసిన కరపత్రాలలో అక్టోబర్ 22 నుండి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాస మహోత్సవాలు నిర్వహిస్తామని ప్రకటించారు. ఆలయం వద్ద నంబర్ ఒకటిన స్వర్ణ పుష్పార్చన, 2న సత్య జ్యోతి, తెప్పోత్సవం, 5న గిరి ప్రదక్షిణ, పంపా హారతులు, జ్వాలాతోరణం, 12న శ్రీ సత్యనారాయణ స్వామి వారి పడిపూజ, 13న శ్రీ స్వామివారి ముఖా నక్షత్రాభిషేకం, సత్యాదీక్ష విరమణ, 15న స్వర్ణ పుష్పార్చన గ్రామ సేవ, 18న శ్రీ స్వామివారి సన్నిధిలో జ్యోతిర్లింగార్చన నిర్వహించ బడతా యన్నారు. అలాగే సత్య దీక్ష మాలా ధారణ అక్టోబర్ 17వ తేదీ నుంచి నంబర్ 13 వరకు భక్తులు సత్య దీక్షలు చేపట్టవచ్చు అన్నారు. సత్య దీక్షలు 27 రోజులపాటు చేయడానికి అవకాశం లేని భక్తులు 18 రోజులు, 9 రోజులు దీక్షలు చేయవచ్చు అన్నారు.

# ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో భక్తుల సందడి





**శనివారం ఆలయ ప్రాంగణం భక్తి పరవశంతో మార్మోగింది**

**ఆత్రేయపురం పెన్ పవర్ అక్టోబర్ 11:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలోని శ్రీ జగన్మోహిని కేశవ %ద% గోపాల స్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల సందోహం నెలకొంది. తెల్లవారుజామునే భక్తులు స్వామివారి దర్శనానికి క్యూ కట్టి, "గోవిందా గోవిందా" నినాదాలతో ఆలయ ప్రాంగణం భక్తి తరంగాలతో మార్మోగింది.

వేకువజామున మేలుకొలుపు సేవ, సుప్రభాత సేవ, అలంకరణోత్సవం ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఆలయాన్ని పుష్పాలతో, దీపాలతో అలంకరించి, ఆధ్యాత్మికతతో నిండిన వాతావరణాన్ని సృష్టించారు.దూరదూర ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు స్వామివారి దివ్యదర్శనం కోసం గంటల కొద్దీ వేచి నిలబడి, దర్శన భాగ్యం పొందారు. ఐదు బుధవారాలుగా జగన్మోహిని కేశవ స్వామిగా విరాజిల్లుతున్న శ్రీ కేసవ స్వామివారి రూపం భక్తులను మంత్ర ముగ్ధులను చేసింది. దర్శనానంతరం భక్తులు ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదంను స్వీకరించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు బి. వెంకటరమణమూర్తి, తెలిపారు.

సమస్త ప్రాంతాల నుండి వచ్చిన భక్తుల భక్తిశ్రద్ధలు, ఆలయ పరిసరాల ఆధ్యాత్మిక సౌందర్యం కలగలిసి, ర్యాలి గ్రామం శనివారం నాడు ఒక చిన్న తిరుమల వాతావరణాన్ని తలపించింది.



# నష్టపరిహారం కోరుతూ ఆరవ రోజుకు చేరుకున్న కాఫీ రైతుల దీక్ష

◆ ఉద్యోగ సంఘాల మద్దతుతో దీక్షకు బాసట



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,అక్టోబర్ 11**:నేషనల్ హైవే 516-ఇ నిర్మాణంలో భాగంగా తాము కాఫీ తోటలను కోల్పోయినా, సరైన నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ, పెదవలస పంచాయతీ,చాపరతిపాలెం,పెదవలస గ్రామాలకి చెందిన రైతులు గత ఆరు రోజులుగా రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్నారు.ఇప్పటికే ఈ దీక్షకు బహుళంగా ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలుపగా, ఆరవ రోజైన శనివారం ఉపాధ్యాయ సంఘాలు మరియు గ్రామానికి చెందిన ఉద్యోగులు సంఘీభావంగా ముందుకు వచ్చారు.రైతులకు మద్దతుగా వారు దీక్షా శిబిరాన్ని సందర్శించి, తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న రైతులు మాట్లాడుతూ "మాకు జరిగిన నష్టానికి సముచిత పరిహారం చెల్లించేవరకు దీక్షను కొనసాగిస్తాం. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం" అని పేర్కొన్నారు.దీక్షా కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులైన బాధిత రైతులు, యువత పాల్గొన్నారు.ఈ నిరాహార దీక్ష గ్రామ ప్రజల్లో చైతన్యం రేపుతోంది. ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ బాధితులు శాంతియుతంగా తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు.

# నిర్వాసితులకు న్యాయం చేయకుండానే భూమి పూజేంటని ప్రశ్నించిన గిరిజనులు

◆ అధికారులను అడ్డుకున్న స్థానికులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్ అక్టోబర్ 11:**ఏపీ జెన్కో ఆధ్వర్యంలో సీలేరు ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న 1350 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణానికి శనివారం భూమి పూజ చేయాలని అధికారులు, మెఘా సంస్థ సన్నాహాలు చేసిన సందర్భంలో గ్రామీణ గిరిజనులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు. "నిర్వాసితులకు న్యాయం చేయకుండా ఎలా భూమి పూజ చేస్తారు?" అంటూ అధికారులను నిలదీశారు. సీలేరు పంచాయతీ పరిధిలో శాండి కోరి, బూసికొండ, పార్వతినగర్ వంటి గ్రామాలు ప్రభావితమవుతున్నా, వారికి పూర్తి స్థాయిలో పరిహారం, పునరావాసం కల్పించకుండా ప్రాజెక్టు ప్రారంభం చేయడాన్ని వారు తీవ్రంగా నిరసించారు.ఈ సందర్భంగా పీసా కమిటీ అధ్యక్షుడు మనోజ్ కుమార్ మాట్లాడుతూ "ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా పనులు ప్రారంభించడం అన్యాయం. ముందుగా ప్రజాభిప్రాయ సేకరణలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి. అప్పుడే పనులు కొనసాగించాలి" అని హెచ్చరించారు.శనివారం శుభదినం కావడంతో, మెఘా కంపెనీ భూమి పూజ చేయాలని ప్రయత్నించగా, స్థానికులు ఆందోళన చేపట్టి భూమి పూజను అడ్డుకున్నారు. దీంతో భూమి పూజను నిలిపివేశామని కంపెనీ ఇంజనీర్లు తెలిపారు.అనంతరం పార్వతినగర్‌లో నిర్వాసితులతో సమావేశం జరిపి, వారి సమస్యలపై చర్చించామని నాయకులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిఎల్ఓ రాష్ట్ర అధ్యక్షుడు కొర్రా మార్క్ రాజు, పంప్డ్ స్టోరేజ్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు ప్రభాస్,కొర్రా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ మద్యం తయారీకి వ్యతిరేకంగా పాడేరులో 13వ తేదీన నిరసన

పాడేరు ఎమ్మెల్యే మత్స్య రస విశ్వేశ్వర రాజు



**స్టాప్ రిపోర్టర్,పాడేరు/గూడెం కొత్త వీధి,పెన్ పవర్,అక్టోబర్ 11** వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తెలుగుదేశం ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యాన్ని ఒక కుటీర పరిశ్రమలాగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో కూడా తయారుచేసి ప్రజల ప్రాణాలని హరిస్తున్నటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పాడేరు శాసన సభ్యులు అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్వర్యంలో అక్టోబర్ 13వ తేదీ సోమవారం పాడేరు జిల్లా కేంద్రంలో ఉన్న ఎక్సైజ్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వర రాజు కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది కావున పార్లమెంట్ సభ్యురాలు, మాజీ పార్లమెంట్ సభ్యులు, మాజీ శాసన సభ్యులు, రాష్ట్ర మరియు జిల్లా వివిధ అనుబంధ విభాగాల నాయకులు ఎంపీపీ లు జడ్పీటీసీలు సర్పంచులు ఎంపీటీసీలు సీనియర్ నాయకులు కార్యకర్తలు ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరడమైనది.

# సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ పై అవగాహన

92వ వార్డు ప్రజల భాగస్వామ్యంతో సదస్సు





**గోపాలపట్నం, పెన్ పవర్, అక్టోబర్ 11 :** జీవీఎంసీ 92వ వార్డు, కంపరపాలెంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు సూచనలపై "సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్" అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమం స్థానిక ప్రజల్లో పన్నులపై అవగాహన పెంపొందించడమే కాక, ఆర్థిక చైతన్యాన్ని అందించాలన్న లక్ష్యంతో జరగింది. ఈ సమావేశానికి వార్డు ఇంచార్జ్ దాడి రమేష్ నాయుడు, వార్డు ప్రెసిడెంట్ కంపర ఆనంద్, కంపర నాగమణి, గణేషు సీఓ తిరుమల రావు, ఆర్పీ మరియు డ్వాక్రా గ్రూప్ సభ్యులు హాజరయ్యారు. ప్రజలలో అవగాహన పెంపు లక్ష్యంగా ఈ కార్యక్రమం ద్వారా జీఎస్టీ, పన్నుల ఉపయోగాలు, ప్రభుత్వాన్ని మద్దతుగా ఉపయోగించుకునే పద్ధతులు వంటి అంశాలపై ప్రజలకు స్పష్టత కల్పించారు. ప్రజా స్థాయిలో ఆదాయపన్ను, వినియోగదారుల హక్కులు వంటి విషయాలపై అవగాహన కల్పించడమనే ముఖ్య ఉద్దేశ్యాన్ని ఇది నెరవేర్చింది. ఎమ్మెల్యే గణబాబు మార్గదర్శనంలో సాగడం, వార్డు నాయకుల చురుకైన పాలుపంచుకోవడం ప్రజలలో విశ్వాసం పెంచే అంశం. ప్రజలకు చేరువగా ఉండే నాయకత్వాన్ని ఇది ప్రతిబింబిస్తోంది.

# జ్యోతిర్మియా బాబా శివాలయం వద్ద ఉచిత హెూమియో వైద్యం -వృద్ధులకు రగ్గులు పంపిణీ





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 11:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం రింతాడ పంచాయతీ అసరాడ గ్రామంలో ఉన్న శ్రీ శ్రీ విశ్వశాంతి జ్యోతిర్మియా బాబా శివాలయం వద్ద శనివారం ఉచిత హెూమియో వైద్యం సేవలు, వృద్ధులకు సహాయ కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సేవా కార్యక్రమాన్ని అఖండ అన్నప్రసాద్ బహుళ స్వయంసేనల సమాఖ్య ట్రస్ట్ చైర్మన్ బాబురావు మరియు వాసుబాబుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అనకాపల్లికి చెందిన ప్రముఖ హెూమియో వైద్యుడు డాక్టర్ కే. నాగరాజ్ కుమార్ అన్ని రకాల వ్యాధులకు ఉచిత హెూమియో చికిత్స అందించి, అవసరమైన మందులను కూడా ఉచితంగా పంపిణీ చేశారు.ఆ తర్వాత అసరాడ, కొట్నాపల్లి, ఉసురుగూడెం గ్రామాలకు చెందిన వృద్ధులు, మహిళల కోసం 100 మందికి రగ్గులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ "ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనతో జీవించాలి. రైతులు పండ్ల మొక్కలు పెంచడానికి ఆసక్తి చూపిస్తే, వారికి మొక్కలు కూడా సమకూర్చుతాం," అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయ ధర్మకర్త జ్యోతిర్మియా బాబా సలిమితి రామారావు, నూకేష్, రవి, నాయుడు, శ్రీరాములు, లింగమూర్తి, చింతమయ్య, కిరణ్, హేమంభరదరరావు, సత్తిబాబు, పరమేష్, శేఖర్, మరియు మహిళలు కోమలి, శాంతి, పుష్ప, కాసులమ్మ సహా పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్య హక్కుల కోసం వైసీపీ సమరభేరి



◆ విశాఖలో పోస్టర్ ఆవిష్కరణతో కోటి సంతకాల ఉద్యమం ప్రారంభం

**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, అక్టోబర్ 11 :**ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవే టీకరణకు వ్యతిరేకంగా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం'కు శ్రీకారం చుట్టింది. ఈ ఉద్య మానికి శ్రీకారం చుట్టుతూ విశాఖ ఉత్తర నియో జకవర్గంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్య క్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షులు, ఉత్తర నియో జకవర్గ సమన్వయకర్త కె.కె. రాజు ప్రధాన అతిథిగా హాజరై ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కె.కె. రాజు ప్రభు త్వ మెడికల్ కాలేజీలు ప్రజల సొత్తు. వాటిని ప్రైవేటు చేతుల్లోకి అప్పగించే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించం. ప్రజల ఆరో గ్య హక్కులను కాపాడటమే ఈ ఉద్యమంల క్ష్యం అని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి గ్రా మ స్థాయి వరకు 45 రోజులపాటు కోటి సంత కాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలి పారు. మేధావి వర్గాలు, ప్రజా సంఘాలు, ఇతర రాజకీయ పార్టీలు, ప్రజలు అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.అంతేకాక, ఆయన ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌ని ప్రశ్నిస్తూ, బీజేపీ అధి కారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిం చారా అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు ఇది రాష్ట్ర ప్రజల పట్ల అన్యాయం కాదా అని ప్రశ్నించారు.తాజాగా తురకపాలెం, కురుపాం ప్రాంతాల్లో జరిగిన ఆరోగ్య సమస్యలను ప్రస్తావిస్తూ అక్కడ మెడికల్ కాలేజీలు పూర్తవి ఉంటే గిరిజన విద్యార్థినులకు సమీపంలోనే మెరుగైన వైద్యం అందేది. కానీ ప్రభుత్వ మెడికల్ సదుపాయాలు తగ్గించడం వల్ల ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి" అని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటు మూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాస రావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అక్కు శంకర రావు, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు సాడి పద్మారెడ్డి, కార్పొరేటర్లు కె. అనిల్ కుమార్ రాజు, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.యన్. శశికళ, కో–ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, ఎస్.ఇ.సి సభ్యురాలు పీలా వెంకటలక్ష్మీ, వాలంటరీ విభా గం జోనల్ ప్రెసిడెంట్ యం. సునీల్ కుమార్, జిల్లా అను బంధ విభాగ అధ్యక్షులు, వార్డు నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మూడు వికెట్లతో చెలరేగిన జడేజా.. రెండో టెస్ట్‌పై పట్టుబిగిస్తోన్న భారత్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా వెస్టిండీస్?తో జరుగుతోన్న రెండో టెస్టుపై టీమిండియా పట్టు బిగిస్తోంది. తొలుత బ్యాటింగ్?లో దుమ్మురేపిన యంగ్ టీమిండియా.. ఆ తర్వాత బౌలింగ్?లోనూ అదరగొడుతోంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సమిష్టిగా రాణిస్తూ.. రెండో టెస్ట్?లో కూడా విజయం దిశగా దూసుకుపోతుంది. ఓవర్ నైట్ స్కోర్ 318/2తో రెండో రోజు ఆట ప్రారంభించిన ఇండియా సెకండ్ డే కూడా పూర్తిగా అధిపత్యం చెలాయించింది.రెండో రోజు మరో 200 పరుగులు చేసి రెండో సెషన్‌లో 518/5 స్కోరు వద్ద ఫస్ట్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది ఇండియా. ఓపెనర్ యశస్వీ జైశ్వాల్ (175), కెప్టెన్ గిల్ (129 నాటౌట్) సెంచరీలతో కదం తొక్కగా.. సాయి సుదర్శన్ (87), కేఎల్ రాహుల్ (38), నితీశ్‌కుమార్ రెడ్డి (43) రాణించారు. వెస్టిండీస్ బౌలర్లలలో వారికన్ 3, రోస్టన్ ఛేజ్ ఒక వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన వెస్టిండీస్.. భారత బ్యాటర్లు పరుగుల వరద పారించిన పిచ్?పై రన్స్ చేయడానికి ఇబ్బందులు పడ్డారు. బుమ్రా, సిరాజ్ దెబ్బకు విండీస్ ఓపెనర్లు తంగెనరైన్ చందర్‌పాల్, జాన్ క్యాంబెల్ క్రీజ్‌లో నిలదొక్కుకునేందుకు సతమతమయ్యారు. ఈ క్రమంలోనే జాన్ క్యాంబెల్ 25 బంతుల్లో 10 పరుగులు చేసి 7 ఓవర్‌లో జడేజా బౌలింగ్?లో ఔట్ అయ్యాడు. మరో ఓపెనర్ తంగెనరైన్ చందర్‌పాల్ కాస్త ధాటిగా ఆడే క్రమంలో 67 బంతుల్లో 34 పరుగులు చేసి పెవిలియన్ చేరాడు. ఓపెనర్లు ఇద్దరిని జడేజానే ఔట్ చేశాడు. ఆ తర్వాత క్రీజ్‌లోకి వచ్చిన అలిక్ అథనాజ్, షాయ్ హెూప్ ధాటిగా ఆడుతూ స్కోర్ బోర్డును కాసేపు పరిగెత్తించారు.

84 బంతుల్లో 41 పరుగులు చేసి క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోన్న క్రమంలో స్పిన్నర్ కుల్దీప్ యాదవ్?కు చిక్కాడు అలిక్ అథనాజ్. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన విండీస్ కెప్టెన్ రాస్టన్ చేజ్ జడేజా బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి డకౌట్ కావడంతో వెనువెంటనే వెస్టిండీస్ రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రెండో రోజు ఆట ముగిసేసరికి 140 పరుగులు

చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది విండీస్. జడేజా మూడు వికెట్లతో రాణించగా.. కుల్దీప్ ఒక వికెట్ తీశారు. ప్రస్తుతం షాయ్ హెూప్ (31) టెవిన్ ఇమ్లాచ్ (14) క్రీజులో ఉన్నారు. ఇండియా కంటే వెస్టిండీస్ ఇంకా 378 పరుగులు వెనుకబడి ఉంది. ఇండియా బౌలర్ల ఫామ్ చూస్తుంటే మూడో రోజు తొలి సెషన్?లోనే విండీస్ చాపచుట్టేసేలా కనిపిస్తున్నారు.

# గిల్ మరో రికార్డు.. కింగ్ కోహ్లీ రికార్డు సమం చేసిన యువ కెప్టెన్





**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యంగ్ కెప్టెన్ శుభ్ మన్ గిల్ మరో రికార్డు సాధించాడు. టెస్టుల్లో కింగ్ కోహ్లీ రికార్డును సమం చేసి చరిత్ర సృష్టించాడు. ఒకే క్యాలెండర్ ఇయర్ లో ఐదు సెంచరీలు చేసి శభాష్ శుభ్ మన్ అనిపించుకుంటున్నాడు. ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో వెస్టిండీస్ తో జరిగుతున్న రెండో టెస్టులో.. సూపర్ సెంచరీతో ఒకే క్యాలెండర్ ఇయర్ లో ఐదు సెంచరీలు నమోదు చేసి కోహ్లీ సరసన నిలిచాడు గిల్. వెస్టిండీస్ తో జరుతున్న రెండో టెస్టులో కెప్టెన్ గిల్ అద్భుత సెంచరీ నమోదు చేశాడు. క్లాస్ బ్యాటింగ్ తో బౌలర్లకు చుక్కలు చూపిస్తూ సెంచరీ చేసుకున్నాడు. మొత్తం 177 బంతులలో 13 ఫోర్లు, ఒక సిక్సుతో సెంచరీ పూర్తి చేశాడు. 130 వ ఓవర్లో 5వ బాల్ కు.. ఖేరీ పియరీ వేసిన బాల్ ను లెఫ్ట్ కవర్స్ వైపు పంపించి మూడు రన్స్ తీసిన గిల్.. ఈ టెస్టులో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. టెస్టుల్లో గిల్ కు ఇది పదో సెంచరీ. ఈ క్యాలెండర్ ఇయర్ లో ఇది ఐదో టెస్టు సెంచరీ. ఒక క్యాలెండర్ ఇయర్ లో కెప్టెన్ గిల్ ఖాతాలో 5వ టెస్టు సంచరీ నమోదు కావడం విశేషం. అంతకు ముందు ఇదే ఫీట్ ను విరాట్ కోహ్లీ వరుసగా 2017, 2018లో సాధించాడు. టెస్టులలో ఒక క్యాలెండర్ ఇయర్ లో కెప్టెన్ గా ఐదు సెంచరీలు చేసిన కోహ్లీ ఫీట్ ను సమం చేశాడు గిల్. కేవలం 7 టెస్టులలో 5 సెంచరీలు నమోదు చేయడం విశేషం.టీమ్ లో రోహిత్, కోహ్లీ వంటి సీనియర్ ఆటగాళ్లు లేని వేళ.. కెప్టెన్సీ బాధ్యతలు అనూహ్యంగా శుభ్ మన్ గిల్ అప్పగించింది బీసీసీఐ. రోహిత్ సక్సెస్ ఫుల్ కెప్టెన్సీ తర్వాత టెస్టు కెప్టెన్ గా బాధ్యతలు స్వీకరించిన గిల్.. బీసీసీఐ నమ్మకాన్ని నిలబెట్టాడు. మొదటి టెస్టులో భారీ విజయాన్ని అందించిన గిల్.. రెండో టెస్టులో జైస్వాల్ (175)తో పాటు సెంచరీ చేసి స్కోర్ ను 500 పరుగుల మార్కును దాటించాడు.

**ఒకే క్యాలెండర్ ఇయర్ లో ఐదు సెంచరీలు బాదిన ఇండియా కెప్టెన్లు:**

1. విరాట్ కోహ్లీ - 2017
2. విరాట్ కోహ్లీ - 2018
3. శుభ్ మన్ గిల్ - 2025

# మ్యాచ్ విన్నింగ్ స్టార్స్‌ను చెన్నై వదులుకుంటుందా..? ఐపీఎల్ వేలం ముందు ఫ్యాన్స్‌లో ఆందోళన





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ -2026 కు సన్నాహకాలు మొదలయ్యాయి. త్వరలోనే వేలం నిర్వహించేందుకు బీసీసీఐ రెడీ అయ్యింది. ఈ క్రమంలో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్యాన్స్ లో ఆందోళన మొదలయ్యింది. టీమ్ నుంచి దాదాపు ఐదుగురు ప్లేయర్లను వదులుకోనున్నట్లు సోషల్ మీడియాలో డిబేట్ నడుస్తోంది. అందులో మ్యాచ్ విన్నింగ్ స్టార్స్ ఉండటంపై ఫ్యాన్స్ షాకింగ్ లో ఉన్నారు. క్రిక్ బజ్ రిపోర్ట్ ప్రకారం 5 మంది ప్లేయర్లను వచ్చే సెషన్ లో చెన్నై వదులుకోనున్నట్లు వార్తలు వచ్చాయి. అందులో సామ్ కరణ్, దీపక్ హుడా, విజయ్ శంకర్, రాహుల్ త్రిపాఠి, డెవాన్ కాన్వే పేర్లు డిస్కషన్ లోకి వచ్చాయి. ఈ లిస్టుపై ఫ్యాన్స్ లో గందరగోళం నెలకొంది. సామ్ కరణ్, కాన్వే వంటి మ్యాచ్ విన్నింగ్ స్టార్స్ ను వదులుకోవాల్సిన అవసరమేంటని సోషల్ మీడియాలో చర్చ కొనసాగుతోంది. ఈ గందరగోళంపై చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం స్పందించింది. ఈ రూమర్స్ కు చెక్ పెట్టేందుకు ఎక్స్ లో పోస్ట్ చేసింది. డోంట్ వర్రీ.. ఆ మ్యాటర్ గురించి అప్ డేట్ చేస్తామని పోస్ట్ చేసింది. ఇంకా అటువంటి నిర్ణయం తీసుకోలేదని.. కేవలం బయో అప్డేట్ చేసినట్లు సీఎస్కే పోస్ట్ చేసింది. దీంతో ఫ్యాన్స్ కాస్త కూలయ్యారు. లాస్ట్ సెషన్ లో చెన్నై సూపర్ కింగ్స్ ఘోర ఫామ్ నుంచి బయటికి వచ్చేందుకు నెక్స్ట్ సెషన్ కోసం సన్నద్ధం అవుతోంది. అందుకోసం భారీ మార్పుల దిశగా అడుగులు వేస్తున్నట్లు ఊహాగానాలు మొదలయ్యాయి. గత సీజన్ లో మొత్తం 14 మ్యాచ్ లు ఆడిన %జూఖ% కేవలం 4 మ్యాచ్ లు గెలవడం ఫ్యాన్స్ ను తీవ్ర నిరాశలకు గురిచేసింది. దీంతో వచ్చే ఆక్షన్ కోసం రిటెన్షన్ లిస్టు రెడీ చేయాల్సి ఉంది. నవంబర్ 15 లోపు రిటెన్షన్ లిస్టు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటి వరకు ఏ అప్ డేట్ ఉన్నా షేర్ చేయనున్నట్లు చెన్నై సూపర్ కింగ్స్ ప్రకటించింది.

# స్టార్ హీరో కొడుకుతో అనుపమ డేటింగ్.. సమాధానం ఇదేనా?







మలయాళీ ముద్దుగుమ్మ అనుపమ పరమేశ్వరన్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చి దాదాపు 10ఏళ్లు కావస్తోంది. ప్రేమమ్ తో కెరీర్ ప్రారంభించిన అనపమ.. ఆ తర్వాత పలు ఇండస్ట్రీలో అవకాశాలు దక్కించుకుంది. ఫలితాలతో సంబంధం లేకుండా అనేక సినిమాల్లో నటించింది. ఆమె అందం, కర్లీ హెయిర్, మోహంలో క్యూట్ నెస్ కు కుర్రకారు ఫిదా అయిపోయారు. తమ క్రష్ లిస్ట్ లో జాయిన్ చేసుకున్నారు.అయితే సెలబ్రిటీలు అన్నాక.. వాళ్లపైనే ఎక్కువ ఫోకస్ ఉంటుంది. ఇక వాళ్ల పర్సనల్ లైఫ్ విషయాలు తెలుసుకునేందుకు అభిమానులు ఎంతగానో ఆరాటపడుతుంటారు. ఈ క్రమంలోనే వాళ్లపై పలు రకాల రూమర్స్ కూడా పుట్టుకొస్తాయి. ముఖ్యంగా అది హీరో అయినా, హీరోయిన్ అయినా వాళ్ల పెళ్లి, లవ్, రిలేషన్ షిప్ గురించే ఎక్కువ ప్రచారం జరుగుతుంటుంది.

దీనికి అనుపమ మినహాయింపేమీ కాదు. గతంలో నుంచే అనుపమ పెళ్లి, రిలేషన్ షిప్ అంటూ అనేకసార్లు ప్రచారం సాగింది. తాజాగా మరోసారి ఈ ప్రచారం జోరందుకుంది. దీనికి కారణం ఆమె ప్రస్తుతం తమిళంలో చేస్తున్న సినిమా. అనుపమ తమిళంలో తాజాగా చేసిన సినిమా బైసన్. ఇందులో అనుపమ హీరోయిన్ కాగా.. చియాన్ విక్రమ్ కుమారుడు ధ్రువ్ విక్రమ్ హీరోగా నటించారు. ఇది లవ్ అండ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోంది.కాగా, ఈ సినిమా షూటింగ్ సమయంలో అనుపమ- ధ్రువ్ మధ్య ఫ్రెండ్ షిప్ బాండింగ్ ఏర్పడింది. అప్పట్నుంచి ఇద్దరూ క్లోజ్ గా ఉంటున్నారని, ఈ ఇద్దరూ రిలేషన్ షిప్లో ఉన్నారని ఇండస్ట్రీ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇది సోషల్ మీడియాలోనూ వైరల్ గా మారింది. అయితే దీనిపై మీడియా డైరెక్ట్ గా అనుపమనే ప్రశ్నించింది. బైసన్ ప్రమోషన్స్ లో రీసెంట్ గా పాల్గొన్న అనుపమకు డేటింగ్ రూమర్స్ గురించి అడిగారు.ఈ ప్రశ్న నుంచి అనుపమ తెలివిగా తప్పించుకుంది. దీనికి సమాధానం చెప్పకుండా దాటవేస్తూ.. అందుకు బదులుగా బైసన్ సినిమాలో ధ్రువ్ నటన, డెడికేషన్ గురించి చెబుతూ ప్రశంసలు కురిపించింది. దీంతో అనుపమ తెలివిగా సమాధానం చెప్పిందని కొందరు అనగా.. మరికొందరూ నిజంగా డేటింగ్ లో ఉందా అని ఆరా తీస్తున్నారు. ఏదేమైనా దీని గురించి ఆ ఇద్దరే చెప్పాల్సి ఉంటుంది. అప్పుడే ఓ క్లారిటీ వస్తుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com